

2 లో గణపయ్యను దర్శించుకున్న ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి


RNI : APTEL/2023/87662

# సింధూర దర్శిని

జాతీయ తెలుగు దినపత్రిక

ప్రతి అక్షరం అవినీతి పై సమరం

WWW.SINDHURADARSINI.COM WWW.EPAPER.SINDHURADARSINI.COM



**విలేకరులు కావలెను**

సింధూరదర్శిని జాతీయ తెలుగు దినపత్రికలో జిల్లాల వారీగా పనిచేయుటకు జిల్లా ఇన్చార్జీలు మరియు మండలాల వారీగా పనిచేయుటకు విలేకరులు కావలెను. ఎలాంటి వేతనం ఇవ్వబడదు. యాడ్స్ పై ఆకర్షణీయమైన కమిషన్ ఇవ్వబడును. అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును. వివరాల కొరకు బయోడేటాతో క్రింది నంబర్‌ను సంప్రదించండి.

సెల్ నెంబర్ : 7 5 6 9 6 7 7 1 7 0



ప్రచురణ: తిరుపతి సంపుటి:3 సంచిక :252 సంపాదకులు: కలిచేటి వెంకయ్య శుక్రవారం 7 ఆగస్టు 2026 పేజీలు: 8 వెల:2

Circulated At :Tirupathi, Chittoor, Kadapa, SPSR Nellore, karnool, Prakasam, Hydrabad




## పోలవరం-బనకచర్లకు కేంద్రం బ్రేక్..

ఏపీ ప్రతిపాదన వెనక్కి

పర్యావరణ ప్రతిపాదనను వెనక్కి పంపిన కేంద్రం

ఈఏసీ నివేదికల ఆధారంగా నిర్ణయం

ట్రిబ్యునల్ తీర్పుపై అభ్యంతరాలు

పొరుగు రాష్ట్రాల ఆందోళనలను గుర్తుచేసిన కేంద్రం

సీడబ్ల్యూసీ అనుమతులు తప్పనిసరని సూచన

వివాదాల తర్వాతే కొత్త దరఖాస్తు పంపాలని హితవు

**అమరావతి, సింధూరదర్శిని:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రతిపాదిం చిన పోలవరం-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం షాక్ ఇచ్చింది. ప్రాజెక్టుకు సంబంధించిన పర్యావరణ అనుమతుల ప్రతిపాదనను కేంద్ర పర్యావరణ, అడవులు, వాతావరణ మార్పుల మంత్రిత్వశాఖ వెనక్కి పంపింది. ఈ విషయాన్ని కేంద్ర పర్యావరణ శాఖ సహాయ మంత్రి కీర్తివర్ధన్‌సింగ్ లిఖితపూర్వకంగా రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేశారు. కేంద్ర పర్యావరణ శాఖలోని ఎన్విరాన్‌మెంట్ అసెస్‌మెంట్ కమిటీ (ఈఏసీ) నివేదికల ఆధారంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. 1980 గోదావరి జల వివాదాల ట్రిబ్యునల్ తీర్పుకు ఈ ప్రాజెక్టు రూపకల్పన, నీటి వినియోగ ప్రతిపాదనలు విరుద్ధంగా ఉన్నాయనే అభ్యంతరాలు వచ్చినట్లు వెల్లడించారు. అలాగే తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల ప్రయోజనాలపై ప్రభావం పడే అవకాశం ఉందనే అంశాన్ని కూడా ఈఏసీ పరిగణనలోకి తీసుకుంది. ప్రాజెక్టుకు ముందు కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) ద్వారా వరద జలాల లభ్యతపై సమగ్ర అధ్యయనం చేయించాలని కేంద్రం సూచించింది. అంతర్రాష్ట్ర వివాదాలు పరిష్కరించిన తర్వాతే పర్యావరణ అనుమతుల కోసం మళ్లీ దరఖాస్తు చేయాలని స్పష్టం చేసింది. రూ.81,900 కోట్ల అంచనా వ్యయంతో రూపొందించిన ఈ ప్రాజెక్టు ద్వారా గోదావరి నుంచి 200 టీఎంసీల వరద జలాలను రాయలసీమకు తరలించాలని ఏపీ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. దీనివల్ల సుమారు 80 లక్షల మందికి తాగునీరు, 3 లక్షల హెక్టార్లకు సాగునీరు అందుతుందని ప్రభుత్వం అంచనా వేసింది. అయితే కేంద్రం తొలి దశలోనే ప్రతిపాదనను వెనక్కి పంపడంతో ప్రాజెక్టు ముందడుగు తాత్కాలికంగా నిలిచిపోయింది.

# ఎఫ్‌సీఆర్ఏ సవరణ బిల్లు ప్రమాదకరం

## కేంద్రంపై మండిపడిన శశిథరూర్

విదేశీ విరాళాల నియంత్రణ చట్ట సవరణ బిల్లుపై శశి థరూర్ తీవ్ర విమర్శలు

ఎన్జీఓల ఆస్తులను స్వాధీనం చేసుకునే అధికారం ప్రభుత్వానికి వస్తుందని ఆందోళన

ఈ మార్పులతో సామాన్య ప్రజలే తీవ్రంగా నష్టపోతారని హెచ్చరిక



**న్యూఢిల్లీ:** విదేశీ విరాళాల నియంత్రణ చట్టానికి (ఎఫ్‌సీఆర్ఏ) కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన సవరణ బిల్లుపై కాంగ్రెస్ సీనియర్ నేత, ఎంపీ శశి థరూర్ తీవ్రంగా ధ్వజమెత్తారు. ఇది కార్యనిర్వాహక అధికారాలను కేంద్రీకరించే ప్రమాదకరమైన చర్య అని, దీనివల్ల విద్య, వైద్యం రంగాల్లో స్వచ్ఛంద సంస్థలపై ఆధారపడిన సామాన్య భారతీయులే అంతిమంగా నష్టపోతారని ఆయన హెచ్చరించారు. 2026 ఎఫ్‌సీఆర్ఏ సవరణ బిల్లు ప్రకారం, ఏదైనా సంస్థ తన రిజిస్ట్రేషన్‌ను కోల్పోయినా లేదా రద్దుకు గురైనా, ఆ సంస్థ ఆస్తులను, ముఖ్యంగా విదేశీ నిధులతో సమకూర్చుకున్న వనరులను స్వాధీనం చేసుకునే అధికారం ప్రభుత్వం నియమించే 'డెజిగ్నేటెడ్ అథారిటీ'కి దక్కుతుంది. పాక్షికంగా విదేశీ నిధులతో నిర్మించిన ఆస్తులను సైతం విక్రయించే అధికారం ఈ అథారిటీకి కల్పించడం గమనార్హం. ఈ నిబంధన ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని, ఇది ప్రభుత్వం మరియు పౌర సమాజం మధ్య ఉన్న సంబంధాలను సమూలంగా మార్చివేస్తుం దని శశి థరూర్ ఆరోపించారు. కేరళలో శతాబ్ద కాలంగా సేవలందిస్తున్న క్రైస్తవ మిషనరీ ఆసుపత్రులు, విద్యాసంస్థల ఉదాహరణలను ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. కేవలం చిన్నపాటి పరిపాలనా పరమైన పొరపాటు దొర్లినా, 500 పడకల ధార్మిక ఆసుపత్రి సైతం ప్రభుత్వ పరమయ్యే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో తీసుకొచ్చిన నిబంధనల కారణంగా విదేశీ విరాళాలు ఇప్పటికే 87శాతం మేర పడిపోయాయని, తద్వారా వేలాది సంస్థలు మూత పడ్డాయని ఆయన గుర్తుచేశారు. ఈ బిల్లును పార్లమెంటులో ప్రతిపక్షాలన్నీ ఏకతాటిపైకి వచ్చి వ్యతిరేకించాలని, కనీసం దీనిని సమగ్ర పరిశీలన నిమిత్తం సెలెక్ట్ కమిటీకి పంపాలని ఆయన డిమాండ్ చేశారు.

# చేనేతలకు అండగా ప్రజా ప్రభుత్వం

'నేతన్న సేవలో' పథకం కింద ఒక్కో కుటుంబానికి రూ.25 వేలు

జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా చీరాలలో నిధులు విడుదల చేయనున్న సీఎం

రూ.179 కోట్లతో 71,536 చేనేత కుటుంబాలకు లబ్ధి

నేతన్న కుటుంబాలతో ముఖాముఖి కానున్న ముఖ్యమంత్రి చంద్రబాబు



**అమరావతి, సింధూరదర్శిని:** నేతన్నల కుటుంబాలకు ప్రజా ప్రభుత్వం అండగా నిలుస్తోంది. ఇప్పటికే ఉచిత విద్యుత్, రాయితీలు, 50 ఏళ్లకే పింఛన్ అందిస్తూ దన్నుగా ఉంటోన్న ప్రభుత్వం... తాజాగా వారి సంక్షేమానికి మరో అడుగు ముందుకేసింది. నేతన్న సేవలో పథకం కింద ఒక్కో చేనేత కుటుంబానికి రూ.25 వేల చొప్పున ప్రభుత్వం జమ చేయనుంది. 7వ తేదీన '12వ జాతీయ చేనేత దినోత్సవం'ను పురస్కరించుకుని 'నేతన్న సేవలో' పథకాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించను న్నారు. ఈ పథకంలో భాగంగా అర్హత కలిగిన ప్రతి నేతన్న కుటుంబానికి రూ.25 వేల సాయం దక్కనుంది. రాష్ట్ర వ్యాప్తంగా 71,536 కుటుంబా లకు రూ.179 కోట్లను ప్రభుత్వం అందించ నుంది. మేనిఫెస్టోలో హామీ ఇవ్వకపోయినా చేనేతల సంక్షేమాన్ని, వృత్తి వారసత్వాన్ని పరి రక్షించే లక్ష్యంతో సర్కారు సాయం అందిస్తోంది.

**చేనేత రంగం బలోపేతం దిశగా...**

తాజాగా ప్రవేశపెడుతోన్న నేతన్న సేవలో పథకమే కాకుండా ఇప్పటికే అనేక విధాలుగా ప్రభుత్వం లబ్ధి చేకూరుస్తోంది. చేనేత కుటుంబాలకు నెలకు 200 యూనిట్లు, పవర్‌లూమ్‌కు 500 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్ అందిస్తోంది. దీంతో 62,541 చేనేత కుటుంబాలు, 10,032పవర్‌లూమ్ యూనిట్లకు ప్రయోజనం కల్పిస్తోంది. దీనికి ఏటా రూ.150 కోట్లు ఖర్చు కానుంది. అంతేకాకుండా 50 ఏళ్లు నిండిన 85 వేల మంది చేనేతలకు రూ.4 వేల చొప్పున ఏడాదికి రూ.420 కోట్లు ఖర్చు చేస్తోంది. 109 ప్రాథమిక చేనేత సహకార సంఘాలకు క్యాష్ క్రెడిట్ ద్వారా రూ.79కోట్లు అందిం చింది. ఉప్పాడలో ప్రత్యేక మౌలిక సదుపా యాల ప్రాజెక్టు, మంగళగిరిలో హ్యాండ్లూమ్ పార్కుతో పాటు అమరావతిలోని శాఖమూరు లో చేనేత, హస్తకళల మ్యూజియం కూడా ఏర్పాటుచేస్తోంది. విశాఖపట్నంలో రూ.4,200 కోట్ల పెట్టుబడితో సుస్థిర టెక్స్‌టైల్ రీసైక్లింగ్ యూనిట్ ఏర్పాటు కానుంది.

**ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన వివరాలు**

చీరాల నియోజకవర్గంలో పర్యటించనున్న ముఖ్యమంత్రి చంద్రబాబు శుక్రవారం ఉదయం 10.30 గంటలకు క్యాంప్ కార్యాల యం నుంచి బయలుదేరి వేటపాలెం మండ లం కొత్తపేట గ్రామానికి 10.50 గంటలకు చేరుకుంటారు. 11.05 గంటలకు ప్రజావేదిక సభలో పాల్గొని ప్రసంగిస్తారు. మధ్యాహ్నం 01.35 గంటలకు జాండ్రపేటలో చేనేతల వర్క్‌షాప్‌లో లబ్ధిదారులతో ముఖాముఖి అవుతారు. కొత్తపేటలో 04.10 గంటలకు టీడీపీ శ్రేణులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తారు. సాయంత్రం 04.45 గంటలకు సీఎం క్యాంప్ కార్యాలయానికి చేరుకుంటారు.

# శ్రీవారి భక్తులకు శుభవార్త..

## తిరుపతికి ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ కొత్త విమానాలు

తిరుపతి సహా 6 నగరాలకు విమాన సర్వీసులు పారంభించనున్న ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్

సెప్టెంబర్ 1 నుంచి కొత్త సర్వీసులు అందుబాటులోకి

శ్రీవారి భక్తులకు ప్రధాన నగరాల నుంచి నేరుగా విమాన ప్రయాణం

హైదరాబాద్, ఢిల్లీ, ముంబై వంటి మెట్రో నగరాలతో పెరగనున్న అనుసంధానం

దేశీయంగా 48 గమ్యస్థానాలకు విస్తరించిన ఎయిర్‌లైన్స్ నెట్‌వర్క్



**అమరావతి, సింధూరదర్శిని:** తెలుగు రాష్ట్రాల విమాన ప్రయాణికులకు, ముఖ్యంగా తిరుమల శ్రీవారి దర్శనానికి వెళ్లే భక్తులకు టాటా గ్రూప్‌కు చెందిన ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ ఒక తీపి కబురు అందించింది. దేశీయంగా తమ నెట్‌వర్క్‌ను వేగంగా విస్తరిస్తున్న ఈ బడ్జెట్ విమానయాన సంస్థ, తిరుపతి సహా ఆరు కొత్త నగరాలకు విమాన సర్వీసులను ప్రారంభించనున్నట్లు ప్రకటించింది. ఈ కొత్త సర్వీసులు సెప్టెంబర్ 1 నుంచి ప్రారంభం కానున్నాయని స్పష్టం చేసింది. ఈ నిర్ణయంతో హైదరాబాద్, ఢిల్లీ, ముంబై వంటి ప్రధాన నగరాల నుంచి తిరుపతికి నేరుగా విమాన ప్రయాణం మరింత సులభతరం కానుంది. ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ తాజాగా ప్రకటించిన ఆరు గమ్యస్థానాల్లో తిరుపతితో పాటు ఔరంగాబాద్, కోయంబత్తూర్, జామ్‌నగర్, జోధ్‌పూర్, మదురై నగరాలు ఉన్నాయి. ఈ నగరాలను చెన్నై, ఢిల్లీ, హైదరాబాద్, ముంబై వంటి కీలకమైన మెట్రో నగరాలతో అనుసంధానించనున్నట్లు సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. తక్కువ ఖర్చుతో కూడిన ప్రత్యక్ష విమాన సేవలను అందించడం, ప్రయాణ సమయాన్ని తగ్గించడం ఈ విస్తరణ ముఖ్య ఉద్దేశమని పేర్కొంది. ఈ కొత్త కనెక్టివిటీ ద్వారా ముఖ్యమైన వ్యాపార, పారిశ్రామిక, పర్యాటక, సాంస్కృతిక కేంద్రాలకు రాకపోకలు మరింత సౌకర్యవంతంగా మారనున్నాయి. ఈ తాజా విస్తరణతో ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ నెట్‌వర్క్ దేశీయంగా 48 గమ్యస్థానాలకు చేరుకుంటుంది. ఇప్పటికే అంతర్జాతీయంగా 16 దేశాలకు సేవలు అందిస్తున్న ఈ సంస్థ, రోజుకు 500కు

మిగతా 2లో...

# విద్యార్థులతో రాహుల్ గాంధీ సభకు అనుమతి రద్దు..



ఉత్తరప్రదేశ్‌లో కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విద్యార్థులతో నిర్వహించనున్న 'ఛాత్రోన్ కీ గూంజ్' కార్యక్రమం చుట్టూ రాజకీయ వివాదం చెలరేగింది. ఆగస్టు 8న ప్రయాగ్‌రాజ్‌లోని కేపీ గ్రౌండ్‌లో జరగాల్సిన సభకు ఇచ్చిన అనుమతిని చివరి నిమిషంలో రద్దు చేయడంతో కాంగ్రెస్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. కేపీ గ్రౌండ్ నిర్వహణ బాధ్యతలు చూసే కాయస్థ పాఠశాల ట్రస్ట్.. భారీ వర్షాలు, భద్రతా పరిస్థితులు, కోర్టు ఆదేశాల కారణంగానే అనుమతి వెనక్కి తీసుకున్నట్లు ప్రకటించింది. అయితే ఇది బీజేపీ ప్రభుత్వ ఒత్తిడితో తీసుకున్న నిర్ణయమేనని కాంగ్రెస్ ఆరోపించింది. విద్యార్థులతో రాహుల్ గాంధీ మాట్లాడకుండా అడ్డుకునే ప్రయత్నం జరుగుతోందని యూపీ కాంగ్రెస్ అధ్యక్షుడు అజయ్ రాయ్ విమర్శించారు. కోటా, డెహ్రా డూన్ తర్వాత ఇప్పుడు ప్రయాగ్‌రాజ్‌లోనూ ఇదే తరహా పరిస్థితి నెలకొందని అన్నారు. ఎలాంటి అడ్డంకులు వచ్చినా కార్యక్రమాన్ని నిర్వహిస్తామని స్పష్టం చేశారు. విద్యార్థులు, పోటీ పరీక్షల అభ్యర్థులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు. ఈ వ్యవహారంపై ప్రియాంక గాంధీ కూడా స్పందించారు. "ఎందుకు భయపడుతున్నారో అర్థం కావడం లేదు" అని వ్యాఖ్యానించారు. సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ ఇక్రా హసన్ కూడా ఈ నిర్ణయాన్ని విమర్శించారు.



## గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థులకు ప్రత్యేక అభినందనలు

**కమిషనర్ వై ఓ.నందన్ , మేయర్ దేవరకొండ సుజాత అశోక్**

నెల్లూరు (సింధూర దర్శిని) 6 ఆగస్టు నెల్లూరు జిల్లా ; నెల్లూరు నగరపాలక సంస్థ మేయర్ దేవరకొండ సుజాత అశోక్, కమిషనర్ వై.ఓ నందన్ లు అంతర్జాతీయస్థాయి కరాటేలో గోల్డ్ మెడల్స్ సాధించిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.దనగరపాలక సంస్థ కార్యాలయం మేయర్ చాంబర్, కమిషనర్ చాంబర్లల్లో విద్యార్థులు ఝాన్సీ రెడ్డి, చరణ్ రెడ్డి లు మేయర్, కమిషనర్ లను గురువారం గౌరవప్రదంగా కలుసుకొని కరాటే పోటీలలో తాము సాధించిన పతకాలు, అవార్డులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా మేయర్ విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించి శుభాశీస్సులను తెలియజేశారు. భవిష్యత్తులో క్రీడలలో ఉన్నత స్థాయికి చేరేందుకు నగరపాలక సంస్థ నుంచి అవసరమైన ప్రోత్సాహాన్ని తప్పకుండా అందిస్తామని ఈ సందర్భంగా మేయర్ వారికి తెలిపారు. అనంతరం కమిషనర్ విద్యార్థులను శాలువాలతో సత్కరించి క్రీడలలో అంతర్జాతీయ స్థాయికి చేరుకొని దేశ గౌరవాన్ని పెంపొందించాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా మాస్టర్లు మాట్లాడుతూ ఈనెల ఆగస్టు 2వ తేదీ ఆదివారం ఊటీలో జరిగిన 4త్ ఇంటర్నేషనల్ గోజురియు కరాటె ఓపెన్ టోర్నమెంట్‌లో నెల్లూరు డీకే మహిళా కళాశాల ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని ఝాన్సీ రెడ్డి 55 కేజీ ల విభాగంలో గోల్డ్ మెడల్ సాధించారని తెలిపారు.అదేవిధంగా శ్రీ చైతన్య కళాశాల ఇంటర్మీడియట్ విద్యార్థి చరణ్ రెడ్డి 65 కేజీ ఫైటింగ్ కేటగిరిలో గోల్డ్ మెడల్ సాధించారని వెల్లడించారు. ఈ టోర్నమెంట్ కి మలేషియా, కతర్, శ్రీలంక, ఇండియా క్రీడాకారులు పాల్గొన్నారని, ఈ టోర్నమెంట్ కి మహా గురు అనంతన్ నాయకత్వం వహించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కరాటే మాస్టర్లు షిహాన్ రవికాంత్, రాష్ట్ర కార్యదర్శి రన్ని భరద్వాజ్ పాల్గొన్నారు.

## శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రమణ్య స్వామికి పట్టు వస్త్రాలు



కాణిపాకం( సింధూర దర్శిని) 6 ఆగస్టు చిత్తూరు జిల్లా ; కాణిపాకం స్వయంభు శ్రీ కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి వారి దేవస్థానం నుండి ఆడికృత్తిక ఉత్సవాలలో భాగంగా గురువారం చిత్తూరు శ్రీ చెంగల్వరాయ కొండ శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి వారికి కాణిపాకం దేవస్థానం నుండి పట్టువస్త్రాలను సమర్పించడం జరిగింది, ఈ కార్యక్రమంలో ఆలయ సూపర్డెంట్ వాసు, టెంపుల్ ఇన్స్పెక్టర్ రవి, ఇన్చార్జి చిట్టిబాబు, అర్చకులు, వేద పండితులు, సుబ్రహ్మణ్య స్వామి దేవస్థానం ఈ.వో సుబ్రహ్మణ్యం నాయుడు, చైర్మన్ సంపత్, బోర్డ్ సభ్యులు, చిత్తూరు దేవాదాయ శాఖ ఇన్స్పెక్టర్ శ్వేత, రాధిక, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గణపయ్యను దర్శించుకున్న ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి



కాణిపాకం( సింధూర దర్శిని) 6 ఆగస్టు చిత్తూరు జిల్లా ; కాణిపాకం స్వయంభు శ్రీ కాణిపాక వరసిద్ధి వినాయక స్వామివారిని దర్శించుకున్న ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కామేశ్వరరావు కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు, వీరికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేసి స్వామి వారి తీర్థప్రసాదాలు శేషవస్త్రం చిత్రపటాన్ని అందజేసిన టెంపుల్ ఇన్స్పెక్టర్ బాలాజీ నాయుడు, ఈ కార్యక్రమంలో చిత్తూరు కోర్టు సిబ్బంది, తదితరులు ఉన్నారు.

## శ్రీవారి భక్తులకు శుభవార్త..

**(మొదటిపేజీ తరువాయి)**

పైగా విమానాలను నడుపుతోంది. ప్రస్తుతం ఈ ఎయిర్‌లైన్స్ వద్ద 100కు పైగా విమానాలు అందుబాటులో ఉన్నాయి. భారత్‌లో అత్యంత రద్దీగా ఉండే పుణ్యక్షేత్రాల్లో తిరుపతి ఒకటి. లక్షలాది మంది భక్తులు శ్రీవారి దర్శనం కోసం వివిధ మార్గాల ద్వారా ఇక్కడికి చేరుకుంటారు. ముఖ్యంగా హైదరాబాద్, ఢిల్లీ, ముంబై వంటి దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఈ కొత్త విమాన సర్వీసులు ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయి. నేరుగా విమాన సౌకర్యం అందుబాటులోకి రావడం వల్ల ప్రయాణ సమయం గణనీయంగా ఆదా అవుతుంది. తద్వారా భక్తులు తమ ప్రయాణాన్ని మరింత సౌకర్యవంతంగా ప్లాన్ చేసుకోవడానికి వీలవుతుంది.

# అతి తక్కువ ఫీజుతో జర్నలిజంలో డిప్లొమో కోర్స్

**చైర్మన్ ఆలపాటి సురేశ్ కుమార్**



విజయవాడ సింధూర దర్శిని: అతి తక్కువ ఫీజు తో "జర్నలిజం లో డిప్లొమా కోర్సు" చేసే మంచి అవకాశాన్ని సి.ఆర్. మీడియా అకాడమీ అందిస్తోందని చైర్మన్ ఆలపాటి సురేశ్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కోర్సు ప్రత్యేకంగా వర్కింగ్ జర్నలిస్టులకోసం ఉద్దేశించినదైనా, జర్నలిజం వృత్తిలో అభిరుచి కలిగిన డిగ్రీ ఉత్తీర్ణులైన సాధారణ అభ్యర్థులు కూడా ఈ డిప్లమా కోర్సుకు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని ఆప్రకటలో ఆయన తెలిపారు. జర్నలిజంలో ఉన్నత ప్రమాణాలు నెలకొల్పే లక్ష్యాలకు అనుగుణంగా ఈ కోర్సును రూపొందించామన్నారు. జర్నలిస్టులకు వృత్తిపరమైన విద్యార్హత ఉంటే మరింత మెరుగైన ఫలితాలు సాధించవచ్చన్నారు. ఆంధ్రా యూనివర్సిటీ జర్నలిజం �$\text{ఢ}$ మాస్ కమ్యూనికేషన్స్ ప్రొఫెసర్, ప్రస్తుత ఒంగోలు ఆంధ్ర కేసరి యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ అయినా ప్రొ. డి.వి.ఆర్.మూర్తి ఆధ్వర్యంలోని వివిధ యూనివర్సిటీల జర్నలిజం డిపార్టుమెంట్ ప్రొఫెసర్ లతో కూడిన "బోర్డు ఆఫ్ స్టడీస్" ఈ డిప్లొమా కోర్సును రూపొందించిందని ఆయన తెలిపారు. ఎలెక్ట్రానిక్, సోషల్ మీడియా ల న్యూస్ చానెళ్లకు, పత్రికలకు ఉన్నత ప్రమాణాలతో పనిచేయ గలిగిన సామర్థ్యం ఈ కోర్సును నేర్చుకోవడంద్వారా అభ్యర్థులు పొందగలరన్నారు. ఆంధ్రా యూనివర్సిటీ జర్నలిజం ఢ మాస్ కమ్యూనికేషన్స్ విభాగం రిటైర్డ్ హెడ్ ఆఫ్ ది డిపార్టుమెంటు ప్రొఫెసర్ పి. బాబీ వర్ధన్ "కోర్సు డైరెక్టర్ గా వ్యవహరిస్తారన్నారు. అదే విధంగా ఆచార్య నాగార్జున యూనివర్సిటీ జర్నలిజం ఢ మాస్ కమ్యూనికేషన్స్ విభాగం హెడ్ ఆఫ్ ది డిపార్టుమెంటు ప్రొ. కె. జోతిర్మయి యూనివర్సిటీ తరపున కోఆర్డినేటర్ వ్యవహరిస్తారన్నారు. ఈ కోర్సుకాల వ్యవధి 6 నెలలని ఆయన తెలిపారు.ఎంపిక చేసిన రిటైర్డ్ అధ్యాపకులు, సీనియర్ జర్నలిస్టులు చే; క్లాసులు నిర్వహిస్తామన్నారు. ప్రతి రోజు సోమవారం నుంచి శుక్రవారం వరకు ఉదయం గం. 8 నుంచి 9 వరకు, 9 నుంచి 10 వరకు రెండు క్లాసులు జరుగుతాయన్నారు. ఆన్ లైన్ (కరెస్పాండెన్సు) విధానంలో ఈ క్లాసులు నిర్వహిస్తామన్నారు. కోర్సు పూర్తి అవుతున్న సమయంలో ప్రతి అభ్యర్థి కోర్సు డైరక్టర్ ఆధ్వర్యంలో అస్సైన్ మెంట్స్ రాయాల్సి ఉంటుందని తెలిపారు. పరీక్షల్లో అభ్యర్థులు పొందిన మార్కులకు అస్సైన్మెంట్ మార్కులు కలిపి తుది ఫలితాలను ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వెల్లడిస్తుందన్నారు. ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు నాగార్జున యూనివర్సిటీ డిప్లొమా సర్టిఫికెట్ జారీ చేస్తుందన్నారు. ఇందుకోసం మీడియా అకాడమీ, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ లు ఒక ఒప్పందం కుదుర్చుకున్నాయన్నారు.

వర్కింగ్ జర్నలిస్టులు డౌన్ లోడ్ చేసుకున్న దరఖాస్తు లో తమ వివరాలు నింపి ఇంటర్ మీడియట్ సర్టిఫికెట్, అక్రిడిటేషన్ కార్డు లేదా ఐ. డి. కార్డు లేదా సర్వీసు ధ్రువీకరణ పత్రం జెరాక్స్ కాపీ లను సెక్రెటరీ, సి.ఆర్. మీడియా అకాడమీ పేరున తీసిన రూ.. 2000/- డిమాండ్ డ్రాఫ్ట్ ను జతపరచి అప్లికేషనలను పంపుకోవాలని ఆయన సూచించారు.జర్నలిజం పై అభిరుచి కలిగిన ఇతర అభ్యర్థులు దరఖాస్తు తో డిగ్రీ సర్టిఫికెట్, సెక్రెటరీ సి.ఆర్.మీడియా అకాడమీ పేరున తీసిన రూ.2500/- డిమాండ్ డ్రాఫ్ట్ ను జతపరచి పంపుకోవాలని సూచించారు.

దరఖాస్తు చేసుకునేందుకు అభ్యర్థులు E9zCG1IVR DMNTsmO_tBK/view?uspRsharing https://drive.google.com/file/d/1ajW20aw5pKw -చేసుకోవాలన్నారు. ఇతర వివరాలు కూడా ఈ లింక్ లో పొందుపరచామన్నారు. దరఖాస్తులను దిగువ చిరునామాకు పంపుకోవాల్సిందిగా ఆయన పేర్కొన్నారు.సెక్రెటరీ, ఆంధ్ర ప్రదేశ్ సి.ఆర్. మీడియా అకాడమీ, 40-6/4-8, 4 వ అంతస్తు, రెవెన్యూ కాలనీ, మొగల్రాజపురం, విజయవాడ. 520010;దరఖాస్తులు పంపేందుకు చివరి తేదీ ఈ నెల (ఆగస్టు) 20 వ తేదీ అని ఆయన తెలిపారు., సెప్టెంబర్ మొదటివారం నుంచి క్లాసులు ప్రారంభ మౌతాయన్నారు.

# పార్టీలకు అతీతంగా సీఎం సహాయనిధి






**ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్**

గూడూరు( సింధూర దర్శిని) 6 ఆగస్టు నెల్లూరు జిల్లా ; కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత గూడూరు నియోజకవర్గంలో సీఎం సహాయ నిధి ద్వారా ఏడు కోట్ల 29 లక్షల రూపాయలు పేదలకు ఇవ్వడం జరిగిందని గత వైసిపి ప్రభుత్వంలో ఒక్కరికి కూడా సీఎం సహాయనిధి అందలేదని సహాయం అందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని ప్రజలు గుర్తుంచుకోవాలని గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ కోరారు . గూడూరు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన 51 లక్షల రూపాయల చెక్కులను ఎమ్మెల్యే సునీల్ కుమార్ లబ్ధిదారులకు అందజేశారు. ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రం ఎన్ని ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న పేద ప్రజలకు సీఎం సహాయ నిధి ద్వారా గూడూరు నియోజకవర్గంలో ఇప్పటివరకు ఏడు కోట్ల 29 లక్షల రూపాయలు అందించడం జరిగిందని గుర్తు చేశారు. గత వైసిపి ప్రభుత్వం లో ఎవరికి ఎటువంటి సహాయం అందలేదని చంద్రన్న బీమా తీసివేశారని అన్నారు. పార్టీలకతీతంగా సీఎం సహాయనిది అందిస్తున్నామని సహాయం పొందిన వారు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిని గుర్తుంచుకోవాలని టిడిపి నాయకులు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను గ్రామస్థాయిలో ప్రజలకు వివరించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో నాయకులు కిరణ్ కుమార్ బిల్లు చెంచురామయ్య . దువ్వూరు రాజశేఖర్ రెడ్డి , పూడిపర్తి ప్రవీణ్ రెడ్డి, రహీం .శ్రీనివాసులు. వెంకటేశ్వరరాజు . వాటంబేడు హరికుమార్ .రాజశేఖర్. జలీల్ .మధుసూదన్ రెడ్డి. గుండాల లీలావతి. తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ షెడ్యూల్డ్ కులాల కమిషన్ చైర్మన్‌కి ఘన స్వాగతం









రేణిగుంట (సింధూర దర్శిని) 6 ఆగస్టు తిరుపతి జిల్లా ; తిరుపతి జిల్లా రెండు రోజుల పర్యటన నిమిత్తం గురువారం సాయంత్రం రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న జాతీయ షెడ్యూల్డ్ కులాల కమిషన్ చైర్మన్ కిషోర్ మక్వానాకి ఘన స్వాగతం లభించింది. తిరుపతి పార్లమెంట్ సభ్యులు గురుమూర్తి, జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, ప్రోటోకాల్ డిప్యూటీ కలెక్టర్ శివ శంకర్ నాయక్, సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు, రేణిగుంట తహసీల్దార్, సంఘ నాయకులు తదితరులు స్వాగతం పలికారు.





## వృద్ధాశ్రమంలో శ్రీనిధి పుట్టిన రోజు వేడుకలు



గూడూరు( సింధూర దర్శిని) 6 ఆగస్టు నెల్లూరు జిల్లా ; లయన్స్ క్లబ్ ఆఫ్ గూడూరు వైజేపీ, టౌన్ ఢ వెస్ట్ క్లబ్స్ సేవ కార్యక్రమాలలో భాగంగా డిస్ట్రిక్ట్ చైర్మన్ లయన్.డి.రవీంద్ర రెడ్డి మనవరాలు శ్రీనిధి పుట్టినరోజు సందర్భంగా గూడూరులోని సాయిరాం చారిటబుల్ వృధాశ్రమము లో వృద్దులు కు అన్నదానం మరియు వస్త్రధానము చేయడం జరిగింది.ఈ కార్యక్రమం లో ఆర్.వి.రావు, గోపినాధ్ రెడ్డి,కావేరి,ప్రసాద్,రాజేంద్ర ప్రసాద్,షైక్.బషీర్, షైక్. ఇంతియాజ్,శివ,రత్నయ్య గురునాధం,శ్రీనివాస్ యాదవ్, యస్.ఎల్.ఎన్.స్వామి, తదితరులు పాల్గొన్నారు.




## తక్కువ జీతం ఎక్కువ పని ఒత్తిడిలో ఆర్టీసీ ఉద్యోగులు

### జేఏసీ కన్వీనర్ మురళీమోహన్ డిమాండ్

గూడూరు (సింధూర దర్శిని) 6 ఆగస్టు నెల్లూరు జిల్లా ; తక్కువ జీతం ఎక్కువ పని ఒత్తిడిలో ఆర్టీసీ ఉద్యోగులు కార్మికులు పనిచేస్తున్నారని మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఏర్పాటు చేసిన తర్వాత ఒక్క కొత్త బస్సు కూడా కొనుగోలు చేయలేదని ఆర్టీసీలో ఖాళీగా ఉన్న పోస్ట్ లను వెంటనే భర్తీ చేయాలని జేఏసీ కన్వీనర్ మురళీమోహన్ డిమాండ్ చేశారు. గూడూరు పట్టణంలోని ఆర్టీసీ డిపో వద్ద జరిగిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.గూడూరు పట్టణంలోని ఆర్టీసీ డిపో వద్ద ఏ పి పి టి డి ఆర్టీసీ ఉద్యోగ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. జేఏసీ కన్వీనర్ మురళీమోహన్ మాట్లాడుతూ ఆర్టీసీలో పనిచేస్తున్న ఉద్యోగులు కార్మికులకు తక్కువ జీతాలు ఎక్కువ పని ఉంటుందని శ్రీ శక్తి పథకం ప్రవేశపెట్టిన తర్వాత ప్రయాణికుల ఓఆర్ బాగా పెరిగిందని కానీ కొత్త బస్సులు అదనపు సిబ్బంది లేరని అన్నారు. విద్యుత్ బస్సుల కొనుగోలు మెయింటినెన్స్ విధుల నిర్వహణ ఆర్టీసీ ద్వారానే నిర్వహించాలని ప్రైవేటు విద్యుత్ బస్సుల సాకుతో మోసివేసిన డిపోలను తెరిపించాలని ఇలా అనేక సమస్యలతో పోరాటం చేస్తున్నామని ప్రభుత్వం సమస్యలు పరిష్కరించకుంటే నిరవధిక సమ్మెకు కూడా వెళ్తామని హెచ్చ రించారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్, పంటయ్య ,ప్రవీణ్ ,శ్రీనివాసులు నారాయణ ,శ్రీధర్ ,రఘు ,భాస్కర్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేని కలిసిన పి ఎ సి ఎస్ పాలకవర్గం



గూడూరు( సింధూర దర్శిని) 6 ఆగస్టు నెల్లూరు జిల్లా; చిల్లకూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘమునకు 2025- 26 సంవత్సరాలకు గాను ఉత్తమ ప్రతిభ కనబరిచిన సంఘముగా ఆప్కాబ్ వారు ఎంపిక చేయబడి ఆగస్టు 4వ తేదీన విజయవాడలో జరిగిన సమావేశంలో ప్రతిభా పురస్కారము షీల్డ్ ఇవ్వడం జరిగినది. ఈ విషయమును గూడూరు శాసనసభ్యులు పాశం సునీల్ కుమార్‌కి తెలియజేయడం జరిగినది. అవార్డు అందుకున్న సంఘ చైర్పర్సన్ కొండా రామచంద్రా రెడ్డి ని సంఘ సిబ్బందిని అభినంది ంచారు.కార్యక్రమంలో సంఘ సీఈవో రామానాయుడు, గుండాల లీలావతి, సిబ్బంది రాధాకృష్ణయ్య,మల్లీశ్వరయ్య, సలీం నవీన్‌చంద్ర, పాల్గొన్నారు.

## చిల్లకూరు లో టిడిపి ఇంటింటా ప్రచారం



గూడూరు( సింధూర దర్శిని) 6 ఆగస్టు నెల్లూరు జిల్లా ; రాష్ట్ర తెలుగుదేశం పార్టీ పిలుపుమేరకు,గూడూరు నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ పాశం సునీల్ కుమార్ ఆదేశాల మేరకు ,పెంచలకోన దేవస్థానం మాజీ చైర్మన్ తానం కి నానాజీ సూచనల మేరకు తెలుగుదేశం పార్టీ 2 సంవత్సరాల నమ్మకం, అభివృద్ధి సంక్షేమ డోర్ టు డోర్ ఇంటింటి ప్రచార కార్యక్రమంలో భాగంగా చిల్లకూరు గ్రామం గొల్లపాలెం నందు డోర్ టు డోర్ తిరగడం జరిగింది. ఈ కార్యక్రమంలో చిల్లకూరు పట్టాభి రెడ్డి కొండా రామచంద్ర రెడ్డి, దాసరి రాంప్రసాద్, బెల్లంకొండ రాజేంద్ర, బెల్లంకొండ శివ, బెదద వోలు శ్రీనివాసులు, మొదవత్త రవి,నందిపాక చిన్నయ్య, కోడి బలరామయ్య, గెద్దె మధు, ఆమరి శ్రీనివాస్, పిల్లల గోపి, చెన్నూరు రమణారెడ్డి, కల్లూరు రవి, సచల బాబా , కాటూరు నవీన్ చంద్ర, మురళి ,జగదీష్ ,పవన్, హర్ష, అంజి, గెద్ది ధనుంజయ, వెంకటరాగయ్య, తదితరులు పాల్గొనడం జరిగింది.

## రీ సర్వేను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి:ఆర్టీవో

గూడూరు (సింధూరదర్శిని) 6 ఆగస్టు నెల్లూరు జిల్లా; చిల్లకూరులో ఈనెల 10వ తేదీ నుండి జరుగు రీ సర్వే ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీఓ అరుణ కుమారి తెలిపారు. చిల్లకూరులోని సచివాలయంలో గురు వారం నిర్వహించిన రీసర్వే గ్రామసభ వేదికలో ఆమె పాల్గొని మాట్లాడారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి పార్లమెంట్ ప్రధానకార్యదర్శి పట్టాభిరామిరెడ్డి, చిల్లకూరు పిఎసిఎస్ అధ్య క్షులు కొండా రామచంద్రారెడ్డి, తాసిల్దార్ గోపీనాథ్ రెడ్డి, డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వే సుబ్బరాయుడు, వీఆర్వో గిద్దలూరు రమణయ్య, సర్వేర్ మధు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# జాతీయ రహదారులపై 384 ప్రమాదకర ప్రాంతాలు గుర్తింపు

**ప్రమాదాల నివారణకు స్వల్పకాలిక, శాశ్వత చర్యలు కొనసాగిస్తున్న కేంద్ర ప్రభుత్వం**

**కొత్త ప్రమాదకర ప్రాంతాల గుర్తింపునకు క్రమం తప్పకుండా భద్రతా తనిఖీలు**

**పార్లమెంటులో ఎంపీ వేమిరెడ్డి ప్రశ్నలకు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ సమాధానం**



నెల్లూరు (సింధూర దర్శిని) 6 ఆగస్టు నెల్లూరు జిల్లా ; జాతీయ రహదారులపై ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న ప్రాంతాల (బ్లాక్ కారిడార్లు) సవరణ, ఆంధ్రప్రదేశ్‌లో జిల్లాల వారీగా గుర్తించిన ప్రమాదకర రహదారి మార్గాల వివరాలు, వాటి నివారణకు చేపడుతున్న స్వల్పకాలిక, శాశ్వత చర్యలు, అలాగే కొత్త ప్రమాదకర ప్రాంతాల గుర్తింపునకు నిర్వహిస్తున్న భద్రతా తనిఖీలపై నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి లోక్‌సభలో లిఖితపూర్వకంగా ప్రశ్నలు అడిగారు. ఎంపీ వేమిరెడ్డి ప్రశ్నలకు కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి శ్రీ నితిన్ జైరాం గడ్కరీ గురువారం లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు. 2023--2025 కాలానికి సంబంధించిన ప్రమాదాల గణాంకాల ఆధారంగా, ఐఐటీ కాన్పూర్ రూపొందించిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత వ్యవస్థ ద్వారా దేశవ్యాప్తంగా రోడ్లపై 6,358 ప్రమాదకర ప్రాంతాలను గుర్తించినట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన జిల్లాల వారీ వివరాలను కూడా వెల్లడించారు.

### ఏపీలో 384 ప్రమాదకర ప్రాంతాలు

కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన వివరాల ప్రకారం, ఆంధ్రప్రదేశ్‌లో రహదారులపై మొత్తం 384 ప్రమాదకర ప్రాంతాలను (జిల్లాల ఉమ్మడి సరిహద్దు కారిడార్లతో కలిపి) గుర్తించారు. జిల్లాల వారీగా పరిశీలిస్తే తూర్పుగోదావరి జిల్లాలో అత్యధికంగా 46, అనకాపల్లి జిల్లాలో 33, ఎస్పీఎస్ఆర్ నెల్లూరు జిల్లాలో 31, శ్రీకాకుళం జిల్లాలో 30, కాకినాడ జిల్లాలో 28, కృష్ణా జిల్లాలో 25, ఎన్టీఆర్ జిల్లాలో 24, విశాఖపట్నం జిల్లాలో 23, ఏలూరు జిల్లాలో 19, గుంటూరు జిల్లాలో 17, విజయనగరం జిల్లాలో 13, తిరుపతి, ప్రకాశం జిల్లాల్లో 12 చొప్పున, చిత్తూరు జిల్లాలో 11, అన్నమయ్య జిల్లాలో 9, కర్నూలు జిల్లాలో 8, పల్నాడు, పశ్చిమగోదావరి జిల్లాల్లో 7 చొప్పున, కోనసీమ, శ్రీ సత్యసాయి జిల్లాల్లో 6 చొప్పున, నంద్యాల జిల్లాలో 4, బాపట్ల జిల్లాలో 3, అనంతపురం, వైఎస్సార్ కడప జిల్లాల్లో 2 చొప్పున ప్రమాదకర రహదారి మార్గాలు ఉన్నట్లు వెల్లడించారు. అదేవిధంగా అనకాపల్లి-కాకినాడ, తూర్పుగోదావరి-కోనసీమ, కృష్ణా-ఏలూరు, ఎన్టీఆర్-కృష్ణా, విశాఖపట్నం-విజయ నగరం, విజయనగరం-శ్రీకాకుళం జిల్లాల సరిహద్దుల్లో ఒక్కో ప్రమాదకర రహదారి మార్గాన్ని గుర్తించినట్లు కేంద్ర ప్రభుత్వం తెలిపింది.

### తక్షణ శాశ్వత చర్యలు

ప్రమాదకర రహదారి మార్గాల సవరణ నిరంతర ప్రక్రియగా కొనసాగుతోందని కేంద్ర మంత్రి తెలిపారు. తక్షణ చర్యల్లో భాగంగా రహదారిపై హెచ్చరిక గుర్తులు, సూచిక బోర్డులు, రక్షణ కంచెలు, రాత్రి వేళ మెరిసే సూచికలు (రోడ్డు స్టడ్స్), రహదారి అంచులను తెలిపే సూచికలు (డిలినేటర్లు), అనధికారిక రోడ్డు డివైడర్ కటింగ్‌ల మూసివేత, వాహనాల వేగ నియంత్రణ చర్యలు, జాతీయ రహదారులపై వీధి దీపాల ఏర్పాటు వంటి పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. అలాగే శాశ్వత పరిష్కారంలో భాగంగా రహదారి నిర్మాణంలో అవసరమైన మార్పులు, కూడళ్ల అభివృద్ధి, అవసరమైన చోట రహదారి విస్తరణ, అండర్‌పాస్‌లు, ఓవర్‌పాస్‌ల నిర్మాణం వంటి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. భూసేకరణ, అటవీ శాఖ అనుమతులు, విద్యుత్, తాగునీటి పైపులైన్లు తదితర సేవల మార్పిడి వంటి ముందస్తు ప్రక్రియల కారణంగా ఈ పనులకు కొంత సమయం పడుతుందని వివరించారు.

### క్రమం తప్పకుండా భద్రతా తనిఖీలు

కొత్తగా నిర్మించిన జాతీయ రహదారులను ప్రజలకు అందుబాటులోకి తీసుకురాకముందే స్వతంత్ర భద్రతా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు కేంద్ర మంత్రి తెలిపారు. తనిఖీల్లో గుర్తించిన రహదారి భద్రత, హెచ్చరిక బోర్డులు, రహదారి గుర్తులకు సంబంధించిన లోపాలను సరి చేసిన తర్వాతే రహదారులను ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా రహదారులు వినియోగంలోకి వచ్చిన తర్వాత కూడా నిర్ణీత వ్యవధిలో భద్రతా తనిఖీలు నిర్వహించి కొత్తగా ఏర్పడిన ప్రమాదకర ప్రాంతాలను గుర్తిస్తున్నట్లు తెలిపారు. ఈ-డీఏఆర్ వ్యవస్థ ద్వారా దేశవ్యాప్తంగా ప్రమాదాల సమాచారాన్ని నిరంతరం పర్యవేక్షిస్తూ, ప్రమాదకర ప్రాంతాలు మరింత ప్రమాదకరంగా మారకముందే నివారణ చర్యలు చేపట్టేందుకు క్షేత్రస్థాయి అధికారులకు అధికారాలు కల్పించినట్లు కేంద్ర మంత్రి వెల్లడించారు.

# కూటమి ప్రభుత్వ ఇంటింటి ప్రచారంలో ప్రజాసమస్యలు పరిష్కారం

**వీధిలైట్లు , ట్రాన్స్ఫార్మర్ సమస్య , నేడు నీటి సమస్య పరిష్కారం**

**వీరారెడ్డి పల్లి 27,28 వార్డులలో మాజీ కౌన్సిలర్ ఇశ్రాయేల్ కుమార్ చొరవతో పరిష్కారమవుతున్న ప్రజా సమస్యలు**

గూడూరు (సింధూర దర్శిని) 6 ఆగస్టు నెల్లూరు జిల్లా ; గత వారం రోజులుగా వీరారెడ్డి పల్లి 27,28 వార్డులలో కొనసాగుతున్న కూటమి ప్రభుత్వ ఇంటింటి ప్రచారం లో ప్రజా సమస్యలను గుర్తించి, వాటిని వెంటనే పరిష్కరిస్తూ మాజీ కౌన్సిలర్ తాతపూడి ఇశ్రాయేల్ కుమార్ ఆధ్వర్యంలో వారి టీడీపీ బూత్ నాయకులు అన్నంగి సుధాకర్, నూనె వాసు, వేల్పుల రమేష్ కుమార్ తదితరులు ముందుకు సాగుతున్నారు. ఇందులో భాగం గా 28 వార్డ్ ఎగువవీరారెడ్డి పల్లి పాత గీత ఐస్ ఫ్యాక్టరీ ముస్లిం ఏరియా వద్ద గత 7 సంవత్సరాలుగా పాడైపోయిన మరమ్మత్తులకు నోచుకోక నిరుపయోగం గా ఉండగా, ఇటీవల తరచుగా మంచి నీరు సరిగా రాక ఇబ్బంది పడుతున్నామని, ఈ బోరు బాగు చేయించమని మాజీ కౌన్సిలర్ ను అక్కడి ప్రజలు



అడగడం, వెంటనే మునిసిపల్ సిబ్బంది కి చెప్పి బోరు మరమ్మత్తు చేయించి ఉపయోగం లోకి తీసుకు రావడం తో అక్కడి స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు . ఈ సందర్భం గా స్థానిక ప్రజలు మాట్లాడుతూ ఇంటింటి ప్రచారం లో ప్రజాసమస్యలు పరిష్కారం అవడం బాగుందని, మా ఏరియా లో మొన్న కరెంటు పోల్ వేసి న దానికి లైట్ వేయించడం, నిన్న ట్రాన్స్ ఫార్మర్ చుట్టూ ప్రమాదభరితం గా ఉన్న ముళ్ల కంచె ను తొలగింప చేయడం, నేడు బోర్ లు రిపేర్ చేయించి నీటి సమస్య పరిష్కరించడం జరిగిందని వీటన్నిటినీ గుర్తించి పరిష్కరించిన మాజీ కౌన్సిలర్ ఇశ్రాయేల్ కుమార్ కి, స్థానిక టీడీపీ నాయకులు అన్నంగి సుధాకర్, నూన్ వాసు, వేల్పుల రమేష్ కుమార్ కి ధన్యవాదములు తెలుపుతున్నమన్నారు.

## పోలీసు జాగిలం 'రాజా' కన్నుమూత



రాయచోటి (సింధూర దర్శిని): వీఐపీ బందోబస్తు, పేలుడు పదార్థాల గుర్తింపులో విశేష సేవలందించిన అన్న మయ్య జిల్లా పోలీసు జాగిలం 'రాజా' (ల్యాబ్రడార్) అనారోగ్యంతో గురువారం కన్ను మూసింది. రాయచోటిలోని పాత పోలీసు క్వార్టర్స్ లో రాజా పార్థివ దేహానికి జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి పూలమాల వేసి నివాళులర్పించి, పోలీస్ శాఖకు రాజా అందించిన సేవలను కొనియాడారు. అనంతరం పోలీసు లాంఛ నాలతో అంత్యక్రియలు గౌరవప్రదంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాయచోటి డీఎస్పీ ఎం.ఆర్. కృష్ణమోహన్, సీఐలు చలపతి, రోషన్, కృష్ణంరాజు నాయక్, చాంద్ బాషా, ఆర్ఐ (అడ్మిన్) యు. రంగనాథ్ బాబు, ఎస్ఐ లు, డాగ్ స్క్వాడ్ మరియు ఇతర పోలీస్ సిబ్బంది వీడ్కోలు పలికారు.

## వైభవంగా గోదాదేవి తిరు నక్షత్ర ఉత్సవాలు

గూడూరు (సింధూర దర్శిని) 6 ఆగస్టు నెల్లూరు జిల్లా ; గూడూరు పట్టణంలోని శ్రీ అళఘనాథ స్వామి దేవస్థానంలో గోదాదేవి తిరునక్షత్ర ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారి పల్లకి సేవ వైభవంగా నిర్వహించారు . గోదాదేవి తిరునక్షత్ర ఉత్సవాల్లో భాగంగా గూడూరు పట్టణంలోని శ్రీ అళఘనాథ స్వామి దేవస్థానంలో గోదాదేవికి విశేష అలంకరణ ఏర్పాటు చేసి మంగళ వాయిద్యాలతో పల్లకి సేవ ఉంజల సేవ ఘనంగా నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈనెల 14వ తేదీ వరకు ప్రతిరోజు పల్లకి సేవ నిర్వహించనున్నారు ఉభయకర్తలుగా సిద్ధారెడ్డి ఇంద్రసేనమ్మ కుటుంబ సభ్యులు వ్యవహరించారు .



# తల్లిపాలే శిశువుకు ఆరోగ్యకరమైన సుస్థిరమైన జీవితానికి తొలి అడుగు

**తల్లిపాల వారోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలి**

**తల్లిపాల ప్రాముఖ్యతపై ప్రతి తల్లి, కుటుంబ సభ్యుల్లో అవగాహన కల్పించాలి**

**జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్**



తిరుపతి (సింధూర దర్శిని) 6 ఆగస్టు తిరుపతి జిల్లా ; తల్లిపాలు శిశువుకు ఆరోగ్యకరమైన, సుస్థిరమైన జీవితానికి బలమైన పునాది అని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ పేర్కొన్నారు. తల్లిపాల ప్రాముఖ్యత, శిశువుల ఆరోగ్య సంరక్షణపై తల్లులు, కుటుంబ సభ్యులు, ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.గురువారం ఉదయం స్థానిక జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా తల్లిపాల వారోత్సవాల సందర్భంగా నిర్వహించాల్సిన కార్యక్రమాలు, జిల్లాలో తల్లిపాల అందజేతకు సంబంధించిన పరిస్థితి, ఇంకా మెరుగుపరచాల్సిన అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం ఒక ప్రత్యేక ఇతివృత్తంతో తల్లిపాల వారోత్సవాలను నిర్వహిస్తున్నామని, ఈ ఏడాది అనే ఇతివృత్తంపై ప్రధానంగా దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. శిశువు జన్మించిన వెంటనే తల్లిపాలను ప్రారంభించడం ద్వారా తల్లి--బిడ్డల మధ్య బలమైన అనుబంధం ఏర్పడటంతో పాటు, శిశువుకు ఆరోగ్యకరమైన జీవితానికి అవసరమైన తొలి పునాది ఏర్పడుతుందని అన్నారు. సాధ్యమైనంత త్వరగా, వైద్యపరంగా అనుకూల పరిస్థితుల్లో శిశువుకు తల్లిపాలు అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సాధారణ ప్రసవాల సందర్భంలో వీలైనంత త్వరగా తల్లిపాలను ప్రారంభించేలా చూడాలని, సిజేరియన్ లేదా ఇతర వైద్య పరిస్థితులలో కూడా తల్లి, శిశువు పరిస్థితులను బట్టి వైద్యుల సూచనల మేరకు తల్లిపాలను ప్రారంభించేలా తల్లులను ప్రోత్సహించాలని తెలిపారు. తల్లులకు కేవలం మౌఖికంగా సూచనలు ఇవ్వడం కంటే, తల్లిపాలు పట్టించే సరైన విధానం, శిశువును సరైన పొజిషన్‌లో ఉంచడం, ల్యాచింగ్ విధానం తదితర అంశాలను ప్రదర్శనల ద్వారా, చిత్రాలు, చార్టుల సహాయంతో సులభంగా అర్థమయ్యేలా వివరించాలని అధికారులను ఆదేశించారు. శిశువు తల్లిపాలను సరిగా పట్టుకోకపోవడం, తల్లికి సరైన పొజిషన్ తెలియకపోవడం వంటి కారణాల వల్ల తల్లిపాలివ్వడంలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని, అందువల్ల ఏఎన్ఎం లు, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ సిబ్బంది తల్లులకు వ్యక్తిగతంగా అవసరమైన మార్గదర్శకత్వం అందించాలని సూచించారు. ఎన్ ఎఫ్ హెచ్ ఎస్ గణాంకాల ప్రకారం జిల్లాలో తల్లిపాలను త్వరగా ప్రారంభించే వారి శాతం 52 శాతం నుంచి 67 శాతానికి పెరగడం సానుకూల పరిణామమని తెలిపారు. శిశువుకు మొదటి ఆరు నెలల పాటు పూర్తిగా తల్లిపాలనే అందించే విషయంలో మరింత పురోగతి సాధించాల్సిన అవసరం ఉందన్నారు. శిశువు పుట్టిన మొదటి ఆరు నెలల వరకు తల్లిపాలు తప్ప అదనంగా నీరు, ఇతర ద్రవాలు లేదా ఆహార పదార్థాలు ఇవ్వాల్సిన అవసరం లేదనే విషయాన్ని తల్లులు, కుటుంబ సభ్యులకు స్పష్టంగా తెలియజేయాలని సూచించారు. ముఖ్యంగా కుటుంబంలోని పెద్దలు, తాతలు, బామ్మలు, ఇతర సంరక్షకుల ద్వారా పాతకాలపు ఆచారాలు, అపోహలు పాటించకుండా సరైన వైద్య సూచనలను మాత్రమే అనుసరించేలా అవగాహన కల్పించాలని అన్నారు. ఆరు నెలల వయస్సు పూర్తయిన తరువాత శిశువుకు వయస్సుకు తగిన అదనపు ఆహారాన్ని ప్రారంభిస్తూ, తల్లిపాలను కూడా కొనసాగించాలని తెలిపారు. 6--8 నెలల వయస్సులో తగిన కాంప్లిమెంటరీ ఫీడింగ్ అందించడంతో పాటు తల్లిపాలను కొనసాగించేలా తల్లులకు అవగాహన కల్పించాలన్నారు. సోషల్ మీడియా, యూట్యూబ్, ఇతర అనధికార వనరుల ద్వారా లభించే అపోహలు, నిర్ధారణ లేని సమాచారాన్ని అనుసరించకుండా ఏఎన్ఎం లు, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది అందించే శాస్త్రీయమైన సలహాలను మాత్రమే పాటించేలా తల్లులను చైతన్యపరచాలని సూచించారు. శిశువుకు తల్లిపాలు అందించే తల్లుల ఆరోగ్యం, పోషకాహారంపై కూడా ప్రత్యేక శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ముఖ్యంగా పేద కుటుంబాలకు చెందిన తల్లులు ప్రసవం అనంతరం త్వరగా పనులకు వెళ్లడం, తగిన పోషకాహారం తీసుకోకపోవడం వంటి కారణాలతో పోషకాహార లోపానికి గురికాకుండా సంబంధిత సిబ్బంది పర్యవేక్షించాలని అన్నారు. తల్లులకు సమతుల్య ఆహారం, తగినంత ప్రోటీన్, అవసరమైన పోషకాలు అందేలా కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించాలని సూచించారు. అదే విధంగా శిశువుల బరువు, పొడవు/ఎత్తు, వయస్సుకు అనుగుణమైన ఎదుగుదలను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. గ్రామ స్థాయిలో లివిలేజ్ హెల్త్, న్యూట్రిషన్ అండ్ శానిటేషన్ కమిటీ లను మరింత క్రియాశీలంగా నిర్వహించాలని సూచించారు. ఆశా కార్యకర్త, అంగన్వాడీ కార్యకర్త, మహిళా పోలీస్ సిబ్బంది సమన్వయంతో గ్రామ స్థాయిలో తల్లులు, గర్భిణీలు, కిశోర బాలికలు, కుటుంబ సభ్యులకు ఆరోగ్యం, పోషణ, పారిశుద్ధ్యం, మాతా--శిశు సంరక్షణ తదితర అంశాలపై నిరంతరం అవగాహన కల్పించవచ్చన్నారు. ప్రతి సచివాలయ పరిధిలో సమావేశాలను క్రమం తప్పకుండా నిర్వహించి, స్థానిక సమస్యలను గుర్తించి పరిష్కార మార్గాలను చర్చించాలని ఆదేశించారు.శిశు మరణాలు మాతృ మరణాలు తగ్గించేందుకు గ్రామ స్థాయిలోనే ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు. తల్లిపాల ప్రాముఖ్యత, గర్భిణీల ఆరోగ్యం, కిశోర బాలికల ఆరోగ్యం, పోషకాహారం, శిశువుల ఎదుగుదల వంటి అంశాలపై సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. తల్లిపాల వారోత్సవాలను కేవలం ఒక వారానికి పరిమితం చేయకుండా, ఏడాది పొడవునా తల్లులు, కుటుంబ సభ్యుల్లో ప్రవర్తనా మార్పు కమ్యూనికేషన్ ద్వారా అవగాహన కల్పించే కార్యక్రమాలను కొనసాగించాలని ఆదేశించారు. తల్లిపాల వారోత్సవాల నిర్వహణలో సహకరిస్తున్న టాటా ట్రస్ట్ బృందానికి జిల్లా కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహిస్తున్న మహిళా శిశు సంక్షేమ శాఖ , వైద్య ఆరోగ్య శాఖ సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో పీడీ ఐసిడిఎస్ వసంతా బాయి, టాటా ట్రస్ట్ విజయవాహిని చారిటబుల్ ఫౌండేషన్ ప్రతినిధులు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, లు, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ సిబ్బంది, మహిళా పోలీస్ సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జ్యువెలరీ పాన్ బ్రోకర్ దుకాణాల్లో భద్రతా ప్రమాణాలు తప్పనిసరి

**నేరాల నివారణకు జ్యువెలరీ, పాన్ బ్రోకర్ దుకాణాలు అప్రమత్తంగా ఉండాలి**

**సీసీటీవీ, కేవైసీ, అనుమానాస్పద లావాదేవీలపై ప్రత్యేక నిఘా**

**జ్యువెలరీ, గోల్డ్ ప్లెడ్జ్ దుకాణాల యజమానులతో పోలీసు శాఖ అవగాహన సమావేశం**





తిరుపతి (సింధూర దర్శిని) 6 ఆగస్టు తిరుపతి జిల్లా ; తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బారాయుడు ఆదేశాల మేరకు, అదనపు ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు పర్యవేక్షణలో ఈ రోజు సీసీఎస్ పోలీస్ స్టేషన్, తిరుపతిలో జ్యువెలరీ దుకాణాలు మరియు పాన్ బ్రోకర్ (గోల్డ్ ప్లెడ్జ్) దుకాణాల యజమానులతో భద్రతా చర్యలు, ఆస్తి నేరాల నివారణ, పోలీసు–వ్యాపారుల సమన్వయంపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి క్రైమ్ ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్లు హాజరయ్యారు.ఇటీవలి కాలంలో బంగారం ధరలు పెరగడంతో బంగారు ఆభరణాలను లక్ష్యంగా చేసుకుని చైన్ స్నాచింగ్, గృహ చోరీలు, ఇతర ఆస్తి నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో జ్యువెలరీ, గోల్డ్ ప్లెడ్జ్ దుకాణాల యజమానులు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు.ప్రతి దుకాణంలో నాణ్యమైన సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసి నిరంతరం పనిచేసేలా చూడాలని, లావాదేవీల పూర్తి రికార్డులు నిర్వహించాలని, బంగారం విక్రయించే లేదా తాకట్టు పెట్టే ప్రతి వ్యక్తి గుర్తింపు పత్రాలను కేవైసీ తప్పనిసరిగా ధృవీకరించాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు, లావాదేవీలు లేదా దొంగిలించబడినట్లు అనుమానమున్న బంగారం గురించి సమాచారం లభించిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. దొంగిలించబడినట్లు అనుమానమున్న బంగారాన్ని కొనుగోలు చేయడం లేదా తాకట్టు స్వీకరించడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. పోలీసు శాఖ నిర్వహించే తనిఖీలు, దర్యాప్తులకు పూర్తి సహకారం అందించాలని, దుకాణ సిబ్బందికి భద్రతా ప్రమాణాలపై అవగాహన కల్పించి వాటిని కచ్చితంగా అమలు చేయాలని సూచించారు.ఈ సందర్భంగా సమావేశంలో పాల్గొన్న జ్యువెలరీ, పాన్ బ్రోకర్ దుకాణాల యజమానులు నేరాల నివారణలో పోలీసు శాఖతో సమన్వయంగా పనిచేస్తూ, అన్ని భద్రతా ప్రమాణాలను పాటిస్తూ పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.



## డీఎస్సీ అవకతవకలపై సిబిఐ విచారణ జరిపించాలి

**గూడూరు సమన్వయకర్త బూదురు గురవయ్య**

గూడూరు (సింధూర దర్శిని) 6 ఆగస్టు నెల్లూరు జిల్లా ; డీఎస్సీలో జరిగిన అవకతవకల పై ప్రభుత్వం వెంటనే సీబీఐ విచారణ జరిపించాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని గూడూరు నియోజకవర్గ వైసిపి ఇన్చార్జ్ గురవయ్య డిమాండ్ చేశారు. గూడూరు పట్టణంలోని టవర్ క్లాక్ సెంటర్ వద్ద వైసీపీ పార్టీ ఆధ్వర్యంలో నియోజకవర్గ ఇన్చార్జి గురవయ్య ఆధ్వర్యంలో రిలే దీక్షలు నిర్వహించారు. ముందుగా రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. నియోజకవర్గ ఇన్చార్జి గురవయ్య మాట్లాడుతూ డీఎస్సీ లో జరిగిన అవకతవకలతో అర్హులైన అనేక మందికి ఉద్యోగాలు రాలేదని లక్షలాది రూపాయలు చేతులు మారాయని అన్నారు. డీఎస్సీ పరీక్షల రాసిన వారికి మద్దతుగా వైసిపి పార్టీ రిలే దీక్షలు నిర్వహిస్తుందని ప్రభుత్వం ఎప్పటికైనా స్పందించి సిపిఐ విచారణ జరిపించాలని నీట్ పరీక్షలు లికేజీ పై ఢిల్లీలో విద్యార్థుల నిరసనకు కేంద్ర మంత్రి రాజీనామా చేశారని మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మీరా రెడ్డి, బొమ్మిడి శ్రీనివాసులు, బాలకృష్ణారెడ్డి ,మురళి ,కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## స్వామివారికి వైభవంగా గ్రామోత్సవం

కాణిపాకం (సింధూర దర్శిని) 6 ఆగస్టు చిత్తూరు జిల్లా ; కాణిపాకం స్వయంభు శ్రీ కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి వారి ఆలయం నందు గురువారం ఆడికృత్తిక సందర్భంగా స్వామి వారికి పగులు ప్రత్యేక పంచామృత అభిషేకము మరియు రాత్రి వైభవంగా గ్రామోత్సవం నిర్వహించడం జరిగింది, ఈ కార్యక్రమానికి ఉభయదారులు కాణిపాకం చెందిన వ్యాయ్ పందలర్ వంశస్థులు నిర్వహిస్తారు, ఈ కార్యక్రమంలో ఆలయ సూపరిడెంట్ వాసు, టెంపుల్ ఇన్స్పెక్టర్ బాలాజీ నాయుడు ఉన్నారు.



# కాణిపాకం నుండి సుబ్రమణ్య స్వామికి పట్టు వస్త్రాలు

కాణిపాకం (సింధూర దర్శిని) 6 ఆగస్టు చిత్తూరు జిల్లా ; కాణిపాకం స్వయంభు శ్రీ కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి వారి దేవస్థానం నుండి ఆడికృత్తిక ఉత్సవాలు సందర్భంగా పాకాల మండలం ఊట్లవారిపల్లి శ్రీ సుబ్రహ్మణ్య స్వామి వారి దేవస్థానమునకు వరసిద్ధి వినాయక స్వామివారి ఆలయం నుండి పట్టు వస్త్రాలను సమర్పించిన పూతలపట్టు శాసనసభ్యులు డాక్టర్ కలికిరి మురళీమోహన్ , మరియు చంద్రగిరి నియోజకవర్గ శాసనసభ్యులు పులివర్తి నాని ,



కుటుంబ సమేతంగా స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించడం జరిగింది, వీరితోపాటు కాణిపాకం దేవస్థానం చైర్మన్ మణి నాయుడు , మరియు ఈవో పెంచల కిషోర్ , పట్టువస్త్రాలను సమర్పించారు, ఈ కార్యక్రమంలో ట్రస్ట్ బోర్డు సభ్యులు పద్మలత కనకరాజ్, వసంతమ్మ, అనసూయ, ఊట్లవారిపల్లి దేవస్థానం చైర్మన్ చంద్రశేఖర్ నాయుడు, ఈ.ఓ యువరాణి, సూపర్డెంట్ వాసు, అర్చకులు, వేద పండితులు, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# వ్యాసాశ్రమానికి పూర్వ వైభవం తీసుకురావడమే లక్ష్యం




ఆశ్రమ అభివృద్ధికి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలి

ప్రభుత్వం మార్గదర్శక, పర్యవేక్షణ పాత్ర మాత్రమే పోషిస్తుంది

శతాబ్ది ఉత్సవాలను వాయిదా వేసి, అందరి సమ్మతితో ఘనంగా నిర్వహించేందుకు చర్యలు

జిల్లా కలెక్టర్ డా. ఎస్.వెంకటేశ్వర్

తిరుపతి (సింధూర దర్శిని) 6 ఆగస్టు తిరుపతి జిల్లా ; జిల్లాలో ఆధ్యాత్మిక, విద్యా, సామాజిక రంగాల్లో విశిష్ట చరిత్ర కలిగిన ఏర్పేడు వ్యాసాశ్రమానికి పూర్వ వైభవాన్ని తీసుకురావడమే లక్ష్యంగా జిల్లా యంత్రాంగం సమగ్ర చర్యలు చేపడుతుందని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు. గురువారం సాయంత్రం స్థానిక వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు ఏర్పేడు వ్యాసాశ్రమ ప్రస్తుత పరిస్థితి, భవిష్యత్తు అభివృద్ధి, నిర్వహణ, విద్యా కార్యక్రమాల పునరుద్ధరణ, ఆశ్రమ ఆస్తుల పరిరక్షణ, పరిపాలనా వ్యవస్థను పటిష్టం చేయడం తదితర అంశాలపై శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి, జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, పీఠాధిపతులు, పూర్వ విద్యార్థులు, ఆశ్రమంతో అనుబంధం ఉన్న స్వామీజీలు, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వ్యాసాశ్రమం వంటి ప్రసిద్ధ ఆధ్యాత్మిక, విద్యా సంస్థ జిల్లాలో ఉండటం మనందరికీ గర్వకారణమన్నారు. గతంలో విద్య, ఆధ్యాత్మికత, సంస్కారం, సేవా కార్యక్రమాల్లో దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందిన వ్యాసాశ్రమం కాలక్రమేణా ఆశించిన స్థాయిలో కార్యకలాపాలు కొనసాగించలేకపోవడం బాధాకరమన్నారు. ఆశ్రమానికి పూర్వ వైభవాన్ని తీసుకురావడానికి తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత వారందరి అభిప్రాయాలను తెలుసుకునేందుకే ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వ్యాసాశ్రమంతో అనుబంధం కలిగి, అక్కడ విద్యను అభ్యసించి ప్రస్తుతం వివిధ పీఠాలకు పీఠాధిపతులుగా ఉన్న స్వామీజీల అనుభవాలు, సూచనలు ఎంతో విలువైనవని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రస్తుత నిర్వహణ బాధ్యతలు చూస్తున్న వారి అభిప్రాయాలను కూడా తెలుసుకుని, అన్ని వర్గాలతో చర్చించి సామరస్యపూర్వకంగా పరిష్కారం కనుగొనాల్సిన అవసరం ఉందన్నారు. వ్యాసాశ్రమాన్ని ప్రభుత్వం పూర్తిగా తన ఆధీనంలోకి తీసుకుని నిర్వహించాలనే ఉద్దేశం లేదని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. ఆశ్రమం స్వతంత్ర ఆధ్యాత్మిక సంస్థగా తన సంప్రదాయాలు, విధానాలను కొనసాగిస్తూ అభివృద్ధి చెందేలా చూడటమే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. అవసరమైన సందర్భాల్లో జిల్లా యంత్రాంగం నుంచి సహకారం అందిస్తామని, దేవాదాయ శాఖ చట్టం, సంబంధిత నిబంధనల పరిధిలో అవసరమైన మార్గదర్శకత్వం, పర్యవేక్షణ మాత్రమే ఉంటుందని తెలిపారు. ఆశ్రమం నిర్వహణ, కార్యక్రమాల రూపకల్పన, అభివృద్ధి అంశాల్లో ఆశ్రమానికి అనుబంధంగా ఉన్న పీఠాధిపతులు, స్వామీజీలు, పూర్వ విద్యార్థులు, భక్తులు సమాలోచన చేసి నిర్ణయాలు తీసుకోవడం ఉత్తమమని సూచించారు. వ్యాసాశ్రమ అభివృద్ధి కోసం సమర్థవంతమైన కమిటీ లేదా ట్రస్ట్ ఏర్పాటు చేయాల్సిన అవసరంపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. కమిటీలో 11 మంది సభ్యులా, 21 మంది సభ్యులా అనే అంశంపై సంబంధిత పీఠాధిపతులు, పూర్వ విద్యార్థులు, భక్తులు సమాలోచన చేసి నిర్ణయం తీసుకుని ప్రభుత్వానికి తెలియజేయాలని కలెక్టర్ సూచించారు. కమిటీలో ఎవరు ఉండాలి, ఎలాంటి విధానాలతో నిర్వహించాలి, ఆశ్రమ సంప్రదాయాలు మరియు మూల సూత్రాలకు అనుగుణంగా ఏ విధమైన పరిపాలనా వ్యవస్థ ఉండాలి అనే అంశాలను సంబంధిత వర్గాలు సమగ్రంగా చర్చించి ప్రతిపాదనలు ఇవ్వాలని కోరారు. సమావేశంలో వచ్చిన ప్రతి సూచన, సలహాను జిల్లా దేవాదాయ శాఖ అధికారులు నమోదు చేసి, భవిష్యత్తులో నిర్ణయాలు తీసుకునే సమయంలో స్పష్టమైన రికార్డు ఉండేలా సమావేశపు మినిట్స్ సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. వ్యాసాశ్రమానికి సంబంధించిన ఆస్తులు, భక్తులు అందించిన విరాళాలు, వారసత్వంగా వచ్చిన ఆస్తులు తదితరాలను పూర్తి పారదర్శకతతో పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఆశ్రమ ఆస్తులు ఎటువంటి పరిస్థితుల్లోనూ అన్యాక్రాంతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆశ్రమ ఆర్థిక వ్యవహారాలు, ఖాతాలు, ఆదాయ--వ్యయ వివరాలను నిబంధనల మేరకు పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు. ఆర్థిక వ్యవహారాల్లో పారదర్శకత, జవాబుదారీతనం ఉండేలా అవసరమైన ఆడిటింగ్ చర్యలను చేపట్టాలని, దేవాదాయ శాఖ పరిధిలో అవసరమైన విచారణ చేపట్టేందుకు ఉన్నతాధికారులకు నివేదిక పంపాలని సంబంధిత అధికారులకు సూచించారు. వ్యాసాశ్రమం స్థాపకులు, పూర్వ పీఠాధిపతులు రూపొందించిన నియమ నిబంధనలు, ట్రస్ట్‌కు సంబంధించిన పత్రాలు, బైలాస్ తదితరాలను పరిశీలించి, చట్టపరమైన అంశాలను అధ్యయనం చేయాలని అధికారులు, సంబంధిత ప్రతినిధులకు సూచించారు. వ్యాసాశ్రమ శతాబ్ది ఉత్సవాలను అత్యంత ఘనంగా, అందరి భాగస్వామ్యంతో నిర్వహించాలంటే తగిన సమయం, సమగ్ర ప్రణాళిక అవసరమని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో ముందుగా ఆశ్రమానికి సంబంధించిన సమస్యలను పరిష్కరించి, అన్ని వర్గాలను ఒకే వేదికపైకి తీసుకువచ్చిన అనంతరం శతాబ్ది ఉత్సవాలను నిర్వహించడం సముచితమని పేర్కొన్నారు. పోలీసు శాఖకు సంబంధించిన బందోబస్తు, సెప్టెంబర్ నెలలో జరిగే ఇతర ప్రధాన కార్యక్రమాలు తదితర అంశాలను దృష్టిలో ఉంచుకుని శతాబ్ది ఉత్సవాలను వాయిదా వేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అన్ని వర్గాల సమ్మతితో, ఎలాంటి విభేదాలకు తావులేకుండా, దేశవ్యాప్తంగా గుర్తింపు పొందే విధంగా శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు భవిష్యత్తులో చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుత నిర్వహణ బాధ్యతల్లో ఉన్నవారి అభిప్రాయాలను కూడా తెలుసుకోవడం అవసరమని జిల్లా కలెక్టర్ తెలిపారు. సమావేశానికి హాజరు కాలేకపోయినందున, వారికి అధికారికంగా సమాచారం అందించి మరోసారి సమావేశానికి ఆహ్వానించాలని సంబంధిత అధికారులకు సూచించారు. అన్ని పక్షాల వాదనలు, అభిప్రాయాలు తెలుసుకుని, ఎవరినీ పక్కన పెట్టకుండా సామరస్యపూర్వకంగా సమస్యకు పరిష్కారం కనుగొనడమే జిల్లా యంత్రాంగం లక్ష్యమన్నారు. ఎవరినీ నిర్బంధించడం, అవమానించడం తమ ఉద్దేశం కాదని, చట్టపరమైన పరిధిలో గౌరవప్రదమైన పరిష్కారం కోసం ప్రయత్నిస్తామని తెలిపారు. వ్యాసాశ్రమానికి సంబంధించిన సమస్యల పరిష్కార ప్రక్రియ పూర్తయ్యే వరకు అన్ని వర్గాలు సంయమనం పాటించాలని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ విజ్ఞప్తి చేశారు. మీడియా లేదా ఇతర వేదికల ద్వారా వివాదాలను మరింత పెంచకుండా, అందరూ పరస్పరం చర్చించుకుని సమస్యలను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవాలని కోరారు. ప్రభుత్వం అన్ని సూచనలు, అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని, చట్టపరమైన పరిధిలో వ్యాసాశ్రమాన్ని తిరిగి అభివృద్ధి పథంలోకి తీసుకువచ్చేందుకు అవసరమైన చర్యలు చేపడుతుందని స్పష్టం చేశారు. వ్యాసాశ్రమం తన ఆధ్యాత్మిక సంప్రదాయాలను కాపాడుకుంటూనే విద్య, సంస్కారం, సేవా కార్యక్రమాల్లో మళ్లీ దేశవ్యాప్తంగా ఆదర్శంగా నిలిచేలా అందరూ కలిసికట్టుగా పనిచేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

శ్రీకాళహస్తి ఎమ్మెల్యే మాట్లాడుతూ... వ్యాసాశ్రమం ప్రైవేట్, ఆధ్యాత్మిక సంస్థగా ఉన్నందున రాజకీయ జోక్యం లేకుండా సమస్యకు పరిష్కారం చూపాల్సిన అవసరం ఉందన్నారు. వ్యాసాశ్రమంతో తనకు ఉన్న అనుబంధం దృష్ట్యా, సంస్థ పూర్వ వైభవాన్ని తిరిగి పొందాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం మరియు పీఠాధిపతుల మధ్య సమన్వయకర్తగా తన వంతు సహకారం అందిస్తానన్నారు. గతంలో ఉన్న విధంగా ఒక సమర్థవంతమైన కమిటీ ద్వారా వ్యవస్థను పద్ధతిగా నిర్వహించడం వల్ల నిర్ణయాల్లో పారదర్శకత, సమష్టి బాధ్యత ఏర్పడుతుందని తెలిపారు. పీఠాధిపతులు, పూర్వ విద్యార్థులు, భక్తులు తమ సూచనలు, కార్యాచరణ ప్రణాళికను జిల్లా కలెక్టర్, ఎస్పీలకు అందించాలని, వాటి ఆధారంగా సమస్య పరిష్కారానికి తన వంతు సహకారం అందిస్తానని చెప్పారు. శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఆలయ ఛైర్మన్ కోలా ఆనంద్ మాట్లాడుతూ..వ్యాసాశ్రమానికి గతంలో ఉన్న విద్యా, ఆధ్యాత్మిక, సామాజిక ప్రాధాన్యతను తిరిగి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. సద్గురు మలయాళస్వామి వారి ఆశయాలకు అనుగుణంగా ఆశ్రమాన్ని అభివృద్ధి చేయాలని, విద్యా సంస్థలు, గురుకులాలు, వృద్ధాశ్రమం వంటి గతంలోని సేవా కార్యక్రమాలను పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. వ్యాసాశ్రమానికి దేశవ్యాప్తంగా, విదేశాల్లోనూ పూర్వ విద్యార్థులు, అనుబంధం ఉన్నవారు ఉన్నారని, వారందరి ఆకాంక్షలకు అనుగుణంగా ఆశ్రమాన్ని పునరుద్ధరించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు మాట్లాడుతూ...వ్యాసాశ్రమానికి సంబంధించిన కార్యక్రమాలు శాంతియుతంగా, అందరి సహకారంతో నిర్వహించేందుకు పోలీసు శాఖ అవసరమైన సహకారం అందిస్తుందని తెలిపారు. శతాబ్ది ఉత్సవాల వంటి భారీ కార్యక్రమాలకు తగిన భద్రతా ఏర్పాట్లు, పోలీసు బందోబస్తు అవసరమవుతుందని, అందువల్ల కార్యక్రమాల తేదీలను ముందస్తుగా సమన్వయంతో నిర్ణయించుకోవాలని సూచించారు. పలువురు పీఠాధిపతులు మాట్లాడుతూ... వ్యాసాశ్రమానికి గతంలో ఉన్న విద్యా ప్రాధాన్యతను తిరిగి తీసుకురావాలని సూచించారు. బ్రహ్మవిద్యా పాఠశాల, గురుకుల విద్య, కన్యా గురుకులం వంటి విద్యా కార్యక్రమాలను నిబంధనల ప్రకారం పునఃప్రారంభించి, విద్యార్థులకు ఆధ్యాత్మికత, విద్య, సంస్కారం కలగలిపిన విద్యను అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆశ్రమానికి చెందిన పుస్తకాలు, గ్రంథాలు, ఆధ్యాత్మిక రచనలు ప్రచురణకు నోచుకోకుండా ఉండకుండా వాటిని పరిరక్షించి, అవసరమైన విధంగా ముద్రణ, ప్రచురణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. దేశవ్యాప్తంగా ఉన్న ఆశ్రమ శాఖలు, అనుబంధ సంస్థల కార్యకలాపాలను కూడా పునరుద్ధరించే విధంగా ప్రణాళిక రూపొందించాలని కోరారు. వ్యాసాశ్రమ అభివృద్ధి కోసం పారదర్శకమైన ట్రస్ట్ లేదా కమిటీ ఏర్పాటు చేసి, పీఠాధిపతులు, పూర్వ విద్యార్థులు, సీనియర్ భక్తులు, ఆశ్రమంతో అనుబంధం ఉన్నవారికి తగిన ప్రాతినిధ్యం కల్పించాలని వారు సూచించారు. ఆశ్రమ స్థాపన లక్ష్యాలు, విద్యా మరియు ఆధ్యాత్మిక కార్యకలాపాలు, గురుకుల వ్యవస్థ, సేవా కార్యక్రమాలు తదితర అంశాలను పునరుద్ధరించే విధంగా భవిష్యత్ కార్యాచరణ రూపొందించాలని సమావేశంలో పాల్గొన్న పీఠాధిపతులు, పూర్వ విద్యార్థులు కోరారు. ఈ సమావేశంలో డి.ఆర్.ఓ నరసింహులు, శ్రీకాళహస్తి మార్కెటింగ్ యార్డ్ ఛైర్మన్ చెంచయ్య, పోలీసు శాఖ అధికారులు, జిల్లా దేవాదాయ శాఖ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, పీఠాధిపతులు, స్వామీజీలు, వ్యాసాశ్రమం పూర్వ విద్యార్థులు, సీనియర్ భక్తులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## కాపాడుకుందాం రాజ్యాంగ హక్కులను

### సిపిఐ నాయకులు డిమాండ్



బనగానపల్లె సింధూర దర్శిని: బనగానపల్లె మండలం పలుకూరు సిపిఐ శాఖ ఆధ్వర్యంలో చలో ఢిల్లీ కార్యక్రమానికి సంబంధించి వాల్ పోస్టర్లను అనంతరం వారు మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దేశ అభివృద్ధి సంక్షేమం సుపరిపాలన మరియు మెరుగైన భవిష్యత్తును అందించలేకపోతున్నారు దేశంలో నేడు నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉంది ఆర్థిక అసమానతలు పెరుగుతున్నాయి గ్రామీణ ఆర్థిక వ్యవస్థ కుంటుపడుతుంది బిజెపి మరియు ఆర్ఎస్ఎస్ పదేపదే మతపరమైన ఉపన్యాసాల వలన ప్రజల మధ్య పిచ్చి పెట్టి పబ్బం గడుపుకుంటున్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఆదాయాలు పెరగడం లేదు ఆహార పదార్థాలు వంటగ్యాస్ రవాణా విద్యుత్ వైద్యం మరియు విద్యా ఖర్చులు నిరంతరం పెరుగుతూనే ఉన్నాయి ధరల పెరుగుదలను తక్షణమే అర కట్టాలి సార్వత్రిక విద్య ఆరోగ్యం అందుబాటులోకి తేవాలి పంటలకు కనీసం మద్దతు ధర కల్పించాలి బ్యాలెట్ పేపర్ పద్ధతిలో ఎన్నికలు నిర్వహించాలని కార్మిక హక్కులను కాపాడాలని దళిత ఆదివాసులపైజరుగుతున్న దాడులను అరికట్టడంలో గోరంగా విఫలం అయిందని అందుకోసమే సెప్టెంబర్ 1న మార్పు కోసం చలో ఢిల్లీ కార్యక్రమానికి పిలుపునివ్వడం జరిగిందని చలో ఢిల్లీ కార్యక్రమం జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో సిపిఐ పలుకూరు శాఖ కార్యదర్శి బాలయ్య సహాయ కార్యదర్శిలు గోపాల్ చెన్నయ్య మధుశేఖర్ చిన్న బాలి నాగరాజు పార్టీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ సుబ్రహ్మణ్య స్వామివారిని దర్శించుకున్న జిల్లా కలెక్టర్

ఆలయ అభివృద్ధి, భక్తులకు మెరుగైన మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం: జిల్లా కలెక్టర్ డా ఎస్. వెంకటేశ్వర్





పాకాల సింధూర దర్శిని: పాకాల మండలం ఊట్లవారిపల్లి గ్రామంలోని ఆనందగిరిపై కొలువై ఉన్న శ్రీ సుబ్రహ్మణ్య స్వామివారిని తిరుపతి జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ గురువారం రాత్రి దర్శించుకున్నారు. జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బారాయుడు, చంద్రగిరి శాసనసభ్యులు పులివర్తి నానితో కలిసి ఆలయానికి విచ్చేసిన జిల్లా కలెక్టర్ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, శాసనసభ్యులకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి స్వామివారి దర్శనం చేయించారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక అభిషేకం, అర్చనలు నిర్వహించి, భక్తుల సంక్షేమం, జిల్లా ప్రజల సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, శాంతి సమృద్ధులు కలగాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆనందగిరిపై వెలసిన శ్రీ సుబ్రహ్మణ్య స్వామివారి ఆలయం ఆధ్యాత్మికంగా, పర్యాటకపరంగా ప్రత్యేక ప్రాధాన్యత కలిగిన క్షేత్రమని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఆలయానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో భక్తులకు అవసరమైన మౌలిక వసతులను మెరుగుపరచడంపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్యం, తాగునీటి సౌకర్యం, విద్యుత్, రహదారి సౌకర్యాలు, పార్కింగ్, భక్తులు విశ్రాంతి తీసుకునేందుకు అవసరమైన వసతులు తదితర అంశాలను పరిశీలించి, అవసరమైన చర్యలు చేపట్టేందుకు సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకోవాలని అధికారులకు సూచించారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా దర్శన ఏర్పాట్లు, క్యూలైన్లు, పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, మరుగుదొడ్ల సౌకర్యం తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. ముఖ్యంగా పండుగలు, ప్రత్యేక ఉత్సవాల సమయంలో భక్తుల రద్దీకి అనుగుణంగా ముందస్తు ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. ఆలయ పరిసర ప్రాంతాన్ని పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా తీర్చిదిద్దడంతో పాటు భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతి కలిగేలా అవసరమైన సదుపాయాలను దశలవారీగా మెరుగుపరచాలని పేర్కొన్నారు. శ్రీ సుబ్రహ్మణ్య స్వామివారి ఆలయ ప్రాశస్త్యాన్ని మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు ఆధ్యాత్మిక పర్యాటక అభివృద్ధికి అనుగుణంగా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఆలయ చారిత్రక, ఆధ్యాత్మిక విశిష్టతను పరిరక్షిస్తూ, భక్తులు మరియు పర్యాటకులు సౌకర్యవంతంగా సందర్శించేలా సమగ్ర అభివృద్ధి ప్రణాళికకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. జిల్లాలోని ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రాల అభివృద్ధి, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు జిల్లా యంత్రాంగం అవసరమైన సహకారం అందిస్తుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, దేవస్థాన సిబ్బంది, సంబంధిత అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.




## “అమెరికా ఉద్యోగం నాకు నేర్పిన ఐదు పాఠాలు”..

-భారతీయుడి పోస్ట్ వైరల్
- అమెరికా అనుభవాలు పంచుకున్న భారతీయుడు
-లింక్డిన్‌లో వైరల్‌గా మారిన పోస్టు
-సమయపాలనకు అధిక ప్రాధాన్యమిస్తారని వెల్లడి
-ముందస్తు సన్నద్ధతపై దృష్టిపెడతారని చెప్పిన ఇండియన్
-బాధ్యతల స్పష్టమైన విభజన ఉంటుందని వ్యాఖ్య
-సూచనలు ఇచ్చే ప్రత్యేక విధానం ఉందని వెల్లడి
-భారత్‌లో బలాలనూ గుర్తుచేసిన యువకుడు

విదేశాలకు వెళ్లిన చాలా మంది అక్కడి ఉద్యోగ విధానం గురించి చెబుతుంటారు. కానీ ఓ భారతీయుడు చెప్పిన ఐదు విషయాలు మాత్రం వేల మందిని ఆలోచింపజేస్తున్నాయి. “అమెరికా నాకు ఇవే నేర్పింది” అంటూ లింక్డిన్‌లో చేసిన పోస్ట్ ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చకు దారి తీసింది. ఉన్నత చదువుల కోసం అమెరికాకు వెళ్లిన అనుష్క్ ఎస్ అనే భారతీయుడు అక్కడి ఉద్యోగ సంస్కృతి తన ఆలోచనా విధానాన్నే మార్చిందని చెప్పాడు. భారత్‌లో నేర్చుకున్న పని తీరు, అమెరికాలో చూసిన విధానం మధ్య చాలా తేడా కనిపించిందని పేర్కొన్నాడు. అమెరికాలో పనిచేసిన అనుభవం తర్వాత ప్రతి ఒక్కరూ నేర్చుకోవాల్సిన ఐదు అలవాట్లు ఉన్నాయని వివరించాడు. వాటిలో మొదటిది సమయానికి విలువ ఇవ్వడం. అక్కడ సమయపాలనను కేవలం మంచి అలవాటుగా కాకుండా, వృత్తి నిబద్ధతగా చూస్తారని తెలిపాడు. సమావేశాలు నిర్ణయించిన సమయానికే మొదలవుతాయని, గడువులకు అక్కడ ఎంతో ప్రాధాన్యం ఉంటుందని చెప్పాడు. ఇలాంటి క్రమశిక్షణే నమ్మకానికి పునాది అవుతుందని అభిప్రాయపడ్డాడు.

రెండో విషయం ముందస్తు సన్నద్ధత. “చూద్దాం... తర్వాత చూసుకుందాం” అనే ధోరణికి అక్కడ పెద్దగా చోటు ఉండదని చెప్పాడు. సమావేశానికి వెళ్లే ముందు విషయంపై పూర్తి అవగాహన ఉండాలని, ఎదురయ్యే ప్రశ్నలు, సమస్యలను ముందే ఊహించి సిద్ధంగా ఉండాలని వివరించాడు.

మూడో అలవాటు బాధ్యతలను స్పష్టంగా పంచడం అని చెప్పాడు. ఏ పని ఎవరు చేయాలి? నిర్ణయం ఎవరు తీసుకోవాలి? ఫలితానికి ఎవరు జవాబుదారీ అన్నది ముందే ఖరారై ఉంటుందని తెలిపాడు.

నాలుగో అంశం సూచనలు ఇచ్చే విధానం. తప్పులను ఎత్తిచూపి అవమానపరచడం కాదని, పని మెరుగుపడేలా వ్యక్తిగతంగా, స్పష్టంగా సూచనలు ఇస్తారని పేర్కొన్నాడు. అవకాశాన్ని వదులుకోకుండా వెంటనే పని మొదలుపెట్టడం ఐదో అలవాటు అని వివరించాడు. ప్రతి చిన్న విషయం ఖరారయ్యే వరకు ఎదురుచూడకుండా, మంచి ఆలోచన ఉంటే వెంటనే అమలు మొదలుపెడతారని చెప్పాడు. పని చేస్తూ ప్రణాళికను అవసరానికి తగ్గట్టు మార్చుకుంటారని వెల్లడించాడు. అయితే భారత్ కూడా తనకు ఎంతో నేర్పిందని అనుష్క్ చెప్పాడు. తక్కువ వనరులతో అవకాశాలు సృష్టించడం, పరిస్థితులకు తగ్గట్టు మారడం, ఒత్తిడిని తట్టుకోవడం వంటి లక్షణాలు భారత్ నుంచి నేర్చుకున్నానని తెలిపాడు. ఈ లక్షణాలకు అమెరికాలో నేర్చుకున్న పని సంస్కృతికి తోడైతే మరింత మంచి ఫలితాలు వస్తాయని అభిప్రాయపడ్డాడు. ఆయన పోస్ట్ లింక్డిన్‌లో వైరల్‌గా మారింది.

## ఫోన్‌పేలో కొత్త సర్వీస్.. ఫిక్స్‌డ్ డిపాజిట్, ఆర్‌డీ సేవలు ప్రారంభం

రోజుకు రూ.100తో డైలీ ఆర్‌డీ
బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలతో భాగస్వామ్యం
యాప్‌లోనే ఎఫ్‌డీ బుకింగ్ సదుపాయం
రూ.5 లక్షల వరకు బీమా రక్షణ
యూపీఐ ఆటోపేతో ఆటోమేటిక్ పొదుపు
7రోజుల తర్వాతే డబ్బు ఉపసంహరణకు అవకాశం

ఫోన్‌పే తన వినియోగదారులకు మరో కొత్త ఆర్థిక సేవను అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రముఖ బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీల భాగస్వామ్యంతో ఫిక్స్‌డ్ డిపాజిట్ (ఎఫ్‌డీ) సేవలను ప్రారంభించింది. అదే సమయంలో ‘శివాలిక్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్’తో కలిసి రోజుకు రూ.100 నుంచే పొదుపు చేసే డైలీ రికరింగ్ డిపాజిట్ (డైలీ ఆర్‌డీ) సదుపాయాన్ని కూడా అందుబాటులోకి తెచ్చింది. ఫోన్‌పే యాప్‌లోనే వివిధ బ్యాంకుల ఎఫ్‌డీలను పరిశీలించి, పోల్చి, వెంటనే బుక్ చేసుకునే అవకాశం కల్పించింది. భాగస్వామ్య బ్యాంకుల్లో చేసిన ఎఫ్‌డీలకు ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం ‘డిపాజిట్ ఇన్సూరెన్స్ అండ్ క్రెడిట్ గ్యారంటీ కార్పొరేషన్’ (డీఐసీజీసీ) నుంచి రూ.5 లక్షల వరకు బీమా రక్షణ ఉంటుంది. కొత్తగా తీసుకొచ్చిన డైలీ ఆర్‌డీ ద్వారా రోజుకు రూ.100 నుంచి రూ.1,000 వరకు ఆటోమేటిక్‌గా పొదుపు చేయొచ్చు. యూపీఐ ఆటోపే ద్వారా ప్రతి రోజు నిర్ణయించిన మొత్తం జమ అవుతుంది. ఏడు రోజుల తర్వాత అవసరమైతే డబ్బు ఉపసంహరించుకోవచ్చు. వరుసగా 15 రోజుల పాటు చెల్లింపులు జరగకపోయినా ఎలాంటి జరిమానా ఉండదని ఫోన్‌పే తెలిపింది. అవసరమైతే ఎప్పుడైనా ఆటోపేను నిలిపివేసే అవకాశం కూడా ఉంది.

ఫోన్‌పే హోమ్ స్క్రీన్‌లోని మ్యూచువల్ ఫండ్స్ అండ్ డిపాజిట్ విభాగంలోకి వెళ్లి ఎఫ్‌డీ లేదా డైలీ ఆర్‌డీని ఎంపిక చేసుకోవచ్చు. అనంతరం బ్యాంకు, కాలపరిమితి, పెట్టుబడి మొత్తాన్ని ఎంచుకుని పాన్, ఆధార్‌తో డిజిటల్ ధ్రువీకరణ పూర్తి చేయాలి. తర్వాత యూపీఐ లేదా నెట్‌బ్యాంకింగ్ ద్వారా చెల్లింపు చేసి డిపాజిట్‌ను ప్రారంభించవచ్చు.

# 27 రోజుల పాలన.. సమాధిలో తరగని సంపద.. అసలేమిటీ కథ?

చైనాలో 27 రోజులు మాత్రమే పాలించిన చక్రవర్తి సమాధిలో భారీ నిధి లభ్యం
సుమారు 120 కేజీల బంగారం, 20 లక్షల కాంస్య నాణేలు స్వాధీనం
లియు హె సమాధిలో అత్యంత పురాతన కన్ఫ్యూషియస్ చిత్రం గుర్తింపు
చరిత్రలోని అపవాదును చెరిపేస్తూ బయటపడుతున్న కొత్త ఆధారాలు
హాన్ రాజవంశం నాటి జీవనశైలికి అద్దం పడుతున్న పురావస్తు ఆవిష్కరణలు



చైనా చరిత్రలో కేవలం 27 రోజులు మాత్రమే చక్రవర్తిగా పాలించి, పదవీచ్యుతుడైన ఒక రాజు సమాధిలో ఊహకందని నిధి నిక్షేపాలు బయటపడ్డాయి. సుమారు రెండు వేల సంవత్సరాల క్రితం పాతిపెట్టిన ఈ సమాధి నుంచి పురావస్తు శాస్త్రవేత్తలు దాదాపు 120 కిలోల బంగారం, 20 లక్షల కాంస్య నాణేలను వెలికితీశారు. పశ్చిమ హాన్ రాజవంశం కాలం నాటి ఈ ఆవిష్కరణ, చరిత్రలో నిర్లక్ష్యానికి గురైన ఆ రాజుపై ఉన్న అభిప్రాయాన్ని పూర్తిగా మార్చేస్తోంది.

క్రీస్తుపూర్వం 74లో హాన్ రాజవంశ చక్రవర్తి అయిన వు మనవడు లియు హె సింహాసనాన్ని అధిష్టించాడు. అయితే, కేవలం 27 రోజుల పాలనలోనే, సరైన నిర్ణయాలు తీసుకోవడంలో విఫలమవుతున్నాడని ఆరోపిస్తూ ఆస్థాన అధికారులు ఆయనను పదవి నుంచి తొలగించారు. అనంతరం ‘మార్క్విస్ ఆఫ్ హైహూన్’ అనే బిరుదు ఇచ్చి ఓ చిన్న ప్రాంతానికి పంపించారు. క్రీస్తుపూర్వం 59లో మరణించే వరకు ఆయన సామాన్య జీవితం గడిపారు. అయితే, 2011లో జియాంగ్జీ ప్రావిన్స్‌లోని నాన్‌చాంగ్ సమీపంలో ఉన్న ఆయన సమాధిని కొందరు దొంగలు దోచుకోవడానికి ప్రయత్నించారు. ఈ ఘటనతో అప్రమత్తమైన పురావస్తు శాఖ అధికారులు భారీస్థాయిలో తవ్వకాలు చేపట్టగా.. ఈ అపార సంపద వెలుగు చూసింది. తవ్వకాల్లో భాగంగా పురావస్తు శాస్త్రవేత్తలు 10 టన్నుల బరువున్న సుమారు 20 లక్షల ‘వు జు’ కాంస్య నాణేలను స్వాధీనం చేసుకున్నారు. చైనాలో ఒకే సమాధి నుంచి ఇంత పెద్ద మొత్తంలో నాణేలు లభించడం ఇదే ప్రప్రథమం. దీనితో పాటు, బంగారు కడ్డీలు, ఫలకాలు, కేకుల వంటి రూపాల్లో ఉన్న 480 బంగారు వస్తువులను వెలికితీశారు. వీటి మొత్తం బరువు 115 నుంచి 120 కిలోల వరకు ఉంటుందని అంచనా. హాన్ రాజవంశ సమాధుల్లో ఇంత భారీగా, ఇన్ని రకాల బంగారు వస్తువులు దొరకడం కూడా ఇదే తొలిసారి. ఈ నిధితో పాటు చరిత్రకు సంబంధించి ఎన్నో కీలక ఆధారాలు లభించాయి. ఒక కాంస్య అద్దంపై తత్వవేత్త కన్ఫ్యూషియస్ చిత్రం ఉండటాన్ని శాస్త్రవేత్తలు గుర్తించారు. ఇప్పటివరకు లభించిన చిత్రాల్లో ఇదే అత్యంత పురాతనమైనదిగా భావిస్తున్నారు. అంతేగాక ‘ది అనలెక్ట్స్’ వంటి ప్రాచీన చైనా గ్రంథాలు లిఖించి ఉన్న వేలాది వెదురు పలకలు కూడా ఈ సమాధిలో దొరికాయి. యాంగ్జీ నదికి దక్షిణాన గుర్రాలు, రథాలతో కూడిన అరుదైన సమాధి గొయ్యి కూడా బయటపడింది. చరిత్రకారులు లియు హెను ఒక బాధ్యతారహితమైన, అనాలోచిత పాలకుడిగా అభివర్ణించారు. కానీ, ఈ సమాధిలో లభించిన ఆధారాలు ఆ వాదనను సవాలు చేస్తున్నాయి. కన్ఫ్యూషియస్ బోధనలు, ఇతర తాత్విక గ్రంథాలు లభించడం, ఆయనకు పాండిత్యం, సంప్రదాయాల పట్ల ఆసక్తి ఉండేవని సూచిస్తున్నాయి. పశ్చిమ హాన్ రాజవంశం కాలం నాటి అత్యంత సురక్షితంగా ఉన్న అరుదైన సమాధుల్లో ఇది ఒకటిగా నిలిచింది. ఆనాటి ఉన్నత వర్గాల జీవన విధానం, ఆర్థిక పరిస్థితులు, అంత్యక్రియల సంప్రదాయాలను అర్థం చేసుకోవడానికి ఈ ఆవిష్కరణలు ఎంతగానో దోహదపడుతున్నాయి. ప్రస్తుతం ఈ సమాధిలో లభించిన అమూల్యమైన కళాఖండాలను అక్కడే ఏర్పాటు చేసిన మ్యూజియంలో ప్రజల సందర్శనార్థం ఉంచారు.

# వైసీపీ ప్రాజెక్టుల యాత్ర ఒక రాజకీయ నాటకం.. చంద్రబాబుపై అవాకులు పేలితే సహించం: కాలవ శ్రీనివాసులు

ప్రాజెక్టుల సందర్శన యాత్రల పేరుతో వైసీపీ కొత్త నాటకాలకు తెరలేపిందని టీడీపీ విమర్శ
ఐదేళ్లలో సీమ ప్రాజెక్టులకు వైసీపీ ఖర్చు రూ.2,000 కోట్లేనని ఆరోపణ
రెండేళ్లలోనే తాము రూ.12,484 కోట్లు ఖర్చు చేశామని తెలిపిన టీడీపీ నేత కాలవ
అధికారంలో ఉన్నప్పుడు జగన్‌ను ఎందుకు ప్రశ్నించలేదని వైసీపీ నేతలను నిలదీత
మూడేళ్లలో రూ.35,313 కోట్లతో 36 ప్రాజెక్టులు పూర్తి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని వెల్లడి



రాయలసీమ ప్రాజెక్టుల సందర్శన యాత్రల పేరుతో వైసీపీ నాయకులు సరికొత్త రాజకీయ నాటకాలకు తెరలేపారని, ప్రాజెక్టుల గురించి మాట్లాడే నైతిక హక్కు వారికి లేదని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నేడు టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తాము ఏ పనీ చేయమని, చేసేవాళ్లను చూస్తే కడుపుమంటతో విమర్శిస్తామని చెప్పడానికి వైసీపీ నేతల తీరే నిదర్శనమని ఆయన ఎద్దేవా చేశారు.

### ఐదేళ్లలో మీరు చేసిందేమిటి?

గత ఐదేళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న జగన్మోహన్ రెడ్డి, తాను రాయలసీమ బిడ్డనని చెప్పుకుంటూనే ఆ ప్రాంత భవిష్యత్తును నాశనం చేశారని కాలవ ఆరోపించారు. 2014-19 మధ్య చంద్రబాబు నాయుడు హయాంలో తాము రాయలసీమ ప్రాజెక్టుల కోసం రూ.12,500 కోట్లు ఖర్చు చేస్తే, జగన్ రెడ్డి తన ఐదేళ్ల పాలనలో కేవలం రూ.2,000 కోట్లు మాత్రమే కేటాయించారని విమర్శించారు. ముఖ్యంగా కర్నూలు, అనంతపురం, చిత్తూరు జిల్లాలకు జీవనాడి అయిన హంద్రీ-నీవా ప్రాజెక్టుకు కనీసం రూ.500 కోట్లు కూడా ఖర్చు పెట్టలేదని ఆయన మండిపడ్డారు. అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే తమ ప్రభుత్వం రాయలసీమ ప్రాజెక్టులపై ఏకంగా రూ.12,484 కోట్లు ఖర్చు చేసిందని, ఇది సీమ చరిత్రలో ఒక సువర్ణ అధ్యాయమని అన్నారు. ఒక్క హంద్రీ-నీవా పైనే గత ఏడాదిలో రూ.3,870 కోట్లు వెచ్చించామని వివరించారు.

### అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు మాట్లాడలేదు?

“ప్రాజెక్టులు సందర్శించే హక్కు మీకు ఎక్కడిది? మీరేమైనా ప్రాజెక్టులు కట్టారా? మీ హయాంలో వాటి గురించి మాట్లాడారా?” అని వైసీపీ నేతలను కాలవ సూటిగా ప్రశ్నించారు. ఐదేళ్ల పాటు జగన్ రెడ్డి సీమ ప్రాజెక్టులను గాలికొదిలేసినప్పుడు, ఏ ఒక్క వైసీపీ ఎమ్మెల్యే, ఎంపీ అయినా అసెంబ్లీలో గానీ, బయట గానీ నిలదీశారా అని నిలదీశారు. ఇప్పుడు పనికిమాలిన బృందంగా ఏర్పడి ప్రాజెక్టులను సందర్శిస్తూ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని, వారిని ప్రజలు నమ్మరని అన్నారు. వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కృష్ణా మిగులు జలాలపై హక్కులు వదులుకుంటామని బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్‌కు లేఖ ఇచ్చి రాయలసీమకు మరణశాసనం రాసింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు.

### ప్రాజెక్టుల విధ్వంసం వైసీపీ విధానం

జగన్ రెడ్డి హయాంలో ఏ ఒక్క ప్రాజెక్టూ ముందుకు సాగలేదని, ఒక తట్ట మట్టి ఎత్తిన పాపాన పోలేదని కాలవ శ్రీనివాసులు విమర్శించారు. పైగా, 102 ప్రాజెక్టులను రద్దు చేస్తూ జీవో 365 ఇచ్చారని గుర్తు చేశారు. హంద్రీ-నీవాకు కరెంట్ బిల్లులు కూడా కట్టలేని అసమర్థ ప్రభుత్వం జగన్‌ది అని దుయ్యబట్టారు. ఇప్పుడు తమ ప్రభుత్వం బిల్లులు కడుతూ, కాలువలు వెడల్పు చేస్తూ, ఎండాకాలంలోనూ చెరువులు నింపుతుంటే ఓర్వలేక యాత్రలు చేస్తున్నారని అన్నారు. ఈ చర్య ఆత్మహత్యాసదృశ్యమేనని వ్యాఖ్యానించారు. రైతుల పాలిట సంజీవని అయిన బిందు సేద్యం పథకాన్ని ఐదేళ్లుగా ఎందుకు ఆపేశారని జగన్‌ను ఏనాడైనా అడిగారా అని ‘గొడ్డలి పార్టీ’ నాయకులను ప్రశ్నించారు.

### సీమ అభివృద్ధికి చంద్రబాబు కట్టుబడి ఉన్నారు

చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రవ్యాప్తంగా మూడేళ్లలో 36 ప్రాజెక్టులను రూ.35,313 కోట్ల వ్యయంతో పూర్తి చేసేందుకు కార్యాచరణ రూపొందించామని కాలవ తెలిపారు. ఇందులో 14 ప్రాజెక్టులు రాయలసీమలోనే ఉన్నాయని, వాటి కోసం రూ.19,108 కోట్లు ఖర్చు చేయనున్నామని వెల్లడించారు. ఇది రాయలసీమ పట్ల చంద్రబాబుకు ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. రాష్ట్ర విభజన సమయంలో చంద్రబాబు చాణక్యం వల్లే కృష్ణా జలాల్లో ఏపీకి 512 టీఎంసీల వాటా దక్కిందని గుర్తు చేశారు. ఒకవైపు సాగునీరు అందిస్తూ, మరోవైపు పండ్ల తోటలను, బిందు సేద్యాన్ని ప్రోత్సహిస్తూ రాయలసీమ వ్యవసాయ ముఖచిత్రాన్ని మారుస్తున్నామని ఆయన వివరించారు. అధికారంలో ఉన్న ఐదేళ్లు అరాచకాలతో రైతుల గొంతు కోసిన వైసీపీకి సీమకు నష్టం చేయడం తప్ప మేలు చేసే ఉద్దేశం లేదని, విజ్ఞులైన ప్రజలు చంద్రబాబు నాయకత్వానికే మద్దతు ఇస్తున్నారని కాలవ శ్రీనివాసులు స్పష్టం చేశారు.

# బరువు తగ్గాలని కోరుకునే వారు పానీ పూరీ తినవచ్చా?



పానిపురి చాలా మందికి నచ్చే చిరుతిండి. దానితో వచ్చే తీపి మరియు రుచికరమైన నీరు కూడా చాలా మంచిది. పానిపురిని భారతదేశం అంతటా గోల్ గుప్పే, పుచ్చా, గుప్ చుప్ మొదలైన పేర్లతో పిలుస్తారు. సాయంత్రం రోడ్డు పక్కన వచ్చే పానిపురి పానీయం కోసం చాలా మంది వరుసలో నిలబడతారు. కొందరు ఇది ఆరోగ్యానికి హానికరం అని, మరికొందరు ఇది ఆరోగ్యకరమైనదని అంటున్నారు. పానిపురిలో పోషకాలు ఉన్నాయా? పూరి సెమోలినా మరియు మైదా పిండితో తయారు చేయబడింది. ఇది చాలా ముఖ్యమైన విషయం. ఇందులో ఫైబర్, విటమిన్ బి కాంప్లెక్స్, విటమిన్ ఇ, కాల్షియం మరియు మెగ్నీషియంలు ఉన్నాయి.

భారతదేశంలోని ప్రతి మూలకు వెళ్లి పానీ పూరి యొక్క విభిన్న వెర్షన్లను రుచి చూడటం మీ అదృష్టం. బంగారపేట పానిపురి మన కర్ణాటకలో కూడా ప్రసిద్ధి చెందింది. దీనిని "గోల్గొప్ప" అని పిలుస్తారు. కోల్‌కతాలో దీనిని "పుచ్కా" అని పిలుస్తారు. ముంబైలో దీనిని "పానిపురి" అని పిలుస్తారు. ఇది ఒక రకమైన పూరి, ఇది చింతపండు నీటిలో ముంచబడుతుంది.

ఉత్తర భారతదేశం మరియు మహారాష్ట్రలో గోల్ గప్ప అని కూడా పిలుస్తారు, పానిపురి రుచి అందరికీ ఆనందం కలిగిస్తుంది. ఇది తినాలని కోరిక కలిగిన వారు పూర్తిగా చిన్న పిల్లలుగా మారిపోయి, మసాలా మరియు గరం మసాలా దినుసులతో, స్వీట్ అండ్ సోర్ నీటిలో ముంచిన పూరి, క్రంచీ ఆకృతితో నోటిలోకి సిప్ చేస్తుంది, మీ నాలుకలోని రుచమెగ్గలన్నింటినీ రసం ప్రవాహంగా వదిలివేస్తుంది. ఇది ప్రతి ఒక్కరూ ఇష్టపడే రుచి. మీకు కొంచెం తీపి కావాలంటే, కొంచెం తియ్యగా ఉంటే, మీకు కొంచెం ఎక్కువ పులియబెట్టాలి. పానిపురి యొక్క ఈ లక్షణం అందరినీ మెచ్చుకునేలా చేస్తుంది.

పూరి లోపల ఉడికించిన బంగాళాదుంపలు, బఠానీల మిశ్రమం కూడా ఉంచారు. పుల్లని నీటిలో చింతపండు రసం, కొత్తిమీర మరియు పొదీనా ఆకులు ఉంటాయి. ఈ బంగాళదుంపలో అధిక స్థాయిలో ఫైబర్, ప్రోటీన్ మరియు అనేక రకాల విటమిన్లు మరియు ఖనిజాలు ఉంటాయి. బఠానీలలో విటమిన్ బి 6, విటమిన్ సి, మాంగనీస్, భాస్వరం, నియాసిన్ మరియు పాంతోతేనిక్ ఆమ్లం ఉంటాయి. రహదారి ప్రక్కన కనిపించే పానిపురిని అనారోగ్య మార్గాల్లో తయారు చేసి ఉండవచ్చు. కానీ దీనికి ఉపయోగించే పదార్థాలు ఆరోగ్యకరమైనవి. సెమోలినాతో చేసిన కూర. చింతపండు పచ్చడి, మిరియాలు, చాట్ మసాలా, జీలకర్ర, బఠానీలు, ఉల్లిపాయలు లేదా చిక్‌పీస్‌తో దీన్ని వడ్డిస్తారు.

**పానిపురి ఆరోగ్యానికి మంచిదా?**

6 పానిపురిలో సుమారు 36 కేలరీలు ఉన్నాయి. మీరు ఇంట్లో పానిపురి తయారు చేస్తే, మీరు బఠానీలను కాకుండా, అందులో మొలకలని కూడా వాడవచ్చు. 70.8 గ్రాముల పానిపురిలో 4 గ్రాముల కొవ్వు ఉంటుంది. ఫిల్లింగ్ నల్లబడితే ఇది వస్తుంది.

**ఇందులో సుమారు 2 గ్రాముల శుద్ధి చేసిన కొవ్వు ఉంటుంది.**

పానిపురిలో 2 గ్రాముల ప్రోటీన్ ఉంది. మీరు నల్ల చిక్‌పీస్ ఉపయోగించి దాన్ని తయారుచేసుకోవచ్చు. ఇందులో ఒక గ్రాము చక్కెర మరియు ఇతర విటమిన్లు మరియు పొటాషియం, మెగ్నీషియం, విటమిన్ ఎ, విటమిన్ బి 6, విటమిన్ బి 12, విటమిన్ సి మరియు విటమిన్‌డి వంటి ఖనిజాలు ఉన్నాయి.

పూరిలో 40 మి.గ్రా సోడియం ఉంటుంది. మీరు తక్కువ తినడం ద్వారా తగ్గించవచ్చు.

మీరు బరువు తగ్గాలనుకున్నప్పుడు పానిపురిని తినవచ్చా?

మీరు బరువు తగ్గాలనుకున్నప్పుడు పానిపురిని తినవచ్చా?

పానిపురిని తయారుచేసే పద్ధతి చాలా అనారోగ్యంగా ఉంటుంది. అయితే, మీరు బరువు తగ్గాలంటే, మీరు అప్పుడప్పుడు పానిపురిని తీసుకోవచ్చు.

మీరు తీపి / పుల్లని నీరు లేకుండా మరియు బఠానీలు లేకుండా తినవచ్చు.

తీపి మరియు పుల్లని నీటిలో అధిక స్థాయిలో ఉప్పు ఉంటుంది. దీనివల్ల నీరు ఆగిపోతుంది లేదా కడుపు నొప్పి వస్తుంది. మీరు సాయంత్రం తినకపోతే మంచిది.

సాయంత్రం తినే బదులు మధ్యాహ్నం పానిపురి తాగవచ్చు. రాత్రి మరియు రాత్రి భోజనంలో కొవ్వు పదార్థాలు తక్కువగా ఉండేట్లు చూసుకోండి.

మీరు పాణిపురిలో ఉప్పును తగ్గించడానికి సాయంత్రం బొప్పాయి లేదా ఆపిల్ తినవచ్చు.

**పానిపురి తినడానికి మంచి సమయం**

ఆరోగ్యకరమైన పానీయాలు తీసుకునే బదులు, ఎప్పుడు తాగాలో మీరు తెలుసుకోవాలి. మీకు పానిపురి కావాలంటే మధ్యాహ్నం తినండి.

పానిపురిలో ఉప్పు అధికంగా ఉండటం వల్ల శరీరంలో నీరు పేరుకుపోతుంది.

సాయంత్రం పానిపురి తాగడం వల్ల బరువు పెరగవచ్చు. వ్యాయామానికి ముందు లేదా తరువాత తినకూడదు.

ఆరోగ్యకరమైన పానిపురి తినడానికి ఇక్కడ కొన్ని గొప్ప మార్గాలు ఉన్నాయి

ఆరోగ్యకరమైన పానిపురి తినడానికి ఇక్కడ కొన్ని గొప్ప మార్గాలు ఉన్నాయి

పూరీ తయారీ కోసం రిఫైండ్ మైదా కాకుండా గోధుమ పిండితో తయారు చేసుకోండి.

పానిపురికి ఎటువంటి బంగాళా దుంపలు లేదా తీపి పచ్చడి జోడించవద్దు.

ఇది కేలరీల తీసుకోవడం తగ్గిస్తుంది. మీరు నల్ల చిక్పీస్(బఠానీలుకు బదులు శెనగలు) ఉపయోగించవచ్చు.

మూలికలు లేదా చిక్‌పీస్ మొలకెత్తినవి వాడితో ఆరోగ్యానికి మరింత మంచిది. మీరు డబ్బు చెల్లించేటప్పుడు ఆరోగ్యం గురించి కూడా ఆలోచించాలి. కదా.బరువు తగ్గాలనుకునే వారు తమకు కావలసినంత తాగవచ్చు

బరువు తగ్గాలనుకునే వారు తమకు కావలసినంత తాగవచ్చు

భోజన సమయంలో మీరు ఆరు చిన్న పానీ పూరీలను వడ్డించవచ్చు. మీ పానిపురి సంతృప్తి చెందిన తరువాత ఉప్పు లేని పానీ మాత్రం త్రాగండి.

ఆ తర్వాత, ఒక గ్లాస్ లోఫ్యాట్ మిల్క్ బొప్పాయి, ఆపిల్‌తో సాయంత్రం ముగించండి.

మీరు ఈ చాట్ తినడానికి ముందు మీ డైటీషియన్‌ను కలవండి.

మీరు గుల్లెటిన్ సెన్సిటివ్ లేదా గల్లెటిన్ లేని ఆహారం తీసుకుంటే, మీరు దానిని తాగకూడదు. మరీ ముఖ్యంగా ఇంట్లో తయారు చేసుకునే వాటితో శుచి, శుభ్రం ఉంటుందని గుర్తించుకోండి. అవుట్ సైట్ ఫుడ్ ను తినడం తగ్గించండి.

# భారత మహిళల దక్షిణాఫ్రికా పర్యటనలో మార్పులు.. కొత్తగా టీ20 సిరీస్ ఖరారు

**భారత మహిళల జట్టు దక్షిణాఫ్రికా పర్యటనలో మార్పులు - టూర్‌కు కొత్తగా మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను జోడింపు**

**2027 ఛాంపియన్స్ ట్రోఫీ సన్నద్ధతలో భాగంగా ఈ నిర్ణయం - డిసెంబర్ 9 నుంచి 30 వరకు టెస్ట్, వన్డే, టీ20 సిరీస్‌లు**



గత పర్యటనలో ఓటమికి బదులు తీర్చుకునే అవకాశం భారత మహిళల క్రికెట్ జట్టు డిసెంబర్ 2026లో చేపట్టనున్న దక్షిణాఫ్రికా పర్యటనకు సంబంధించి కీలకమైన మార్పు చోటుచేసుకుంది. ముందుగా ఖరారైన షెడ్యూల్‌కు అదనంగా మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను జోడించినట్లు క్రికెట్ సౌతాఫ్రికా (సీఎస్ఏ) అధికారికంగా ప్రకటించింది. 2027 ఫిబ్రవరిలో శ్రీలంక వేదికగా జరగనున్న తొలి ఐసీసీ ఉమెన్స్ ఛాంపియన్స్ ట్రోఫీకి జట్లను సన్నద్ధం చేసే లక్ష్యంతో ఈ టీ20 సిరీస్‌ను చేర్చినట్లు సీఎస్ఏ స్పష్టం చేసింది. ఈ పర్యటన డిసెంబర్ 9 నుంచి 30 వరకు జరగనుంది. ఈ మార్పుతో, పర్యటన చివర్లో టీ20 సిరీస్ నిర్వహించనున్నారు. డిసెంబర్ 26న బెనోనిలోని విల్లోమూర్ పార్క్‌లో పండుగ వాతావరణంలో 'బాక్సింగ్ డే' టీ20 మ్యాచ్ జరగనుంది. మిగిలిన రెండు టీ20 మ్యాచ్‌లు డిసెంబర్ 29,30 తేదీలలో పోచెఫ్‌స్ట్రూమ్‌లోని ఎన్‌డబ్ల్యూసీ ఓవల్‌లో జరుగుతాయి. ఈ పర్యటన తొలుత డిసెంబర్ 9 నుంచి 12 వరకు గెబెర్హాలోని సెయింట్ జార్జ్ పార్క్‌లో ఏకైక టెస్టు మ్యాచ్‌తో ప్రారంభమవుతుంది. ఈ టెస్టు అనంతరం ఇరు జట్ల మధ్య మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ జరగనుంది. ఈ వన్డేలు ఐసీసీ ఉమెన్స్ ఛాంపియన్‌షిప్ (×ఔజ)లో భాగం. డిసెంబర్ 16 నుంచి 22 వరకు పార్ల్, కేప్ టౌన్, బ్లూమ్‌ఫోంటెయిన్ నగరాలు ఈ వన్డే మ్యాచ్‌లకు ఆతిథ్యం ఇస్తాయి.

ఈ సవరించిన షెడ్యూల్‌పై క్రికెట్ సౌతాఫ్రికా సీఈఓ ఫోలెట్సీ మొసెకీ హర్షం వ్యక్తం చేశారు. "భారత పర్యటనకు టీ20 సిరీస్‌ను జోడించడం సంతోషంగా ఉంది. పండుగ సీజన్‌లో జరిగే ఈ మ్యాచ్‌లు, వచ్చే ఏడాది ఛాంపియన్స్ ట్రోఫీకి మా ప్రోటీస్ మహిళల జట్టు సన్నద్ధతకు ఎంతగానో ఉపయోగపడతాయి. ప్రపంచ క్రికెట్‌లో భారత్ అత్యంత బలమైన జట్లలో ఒకటి. అలాంటి జట్టుతో మూడు ఫార్మాట్లలో తలపడటం మాకు విలువైన అనుభవాన్ని ఇస్తుంది,"అని ఆయన పేర్కొన్నారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో టీ20 ప్రపంచకప్ సన్నాహాల్లో భాగంగా భారత మహిళల జట్టు దక్షిణాఫ్రికాలో ఐదు టీ20ల సిరీస్‌లో పాల్గొంది. అయితే, ఆ సిరీస్‌ను 1-4 తేడాతో కోల్పోయింది. ఇప్పుడు ఈ కొత్త సిరీస్‌తో ఆ ఓటమికి బదులు తీర్చుకునే అవకాశం భారత జట్టుకు లభించింది.

**సవరించిన పూర్తి షెడ్యూల్:**

ఏకైక టెస్టు: డిసెంబర్ 9 - 12: గెబెర్హా (స్థానిక కాలమానం ప్రకారం ఉదయం 10 గంటలకు)

**వన్డే సిరీస్:**

1వ వన్డే: డిసెంబర్ 16, పార్ల్ (ఉదయం 10 గంటలకు)

2వ వన్డే: డిసెంబర్ 19, కేప్ టౌన్ (మధ్యాహ్నం 2 గంటలకు)

3వవన్డే: డిసెంబర్ 22, బ్లూమ్‌ఫోంటెయిన్ (మధ్యాహ్నం 2 గంటలకు)

**టీ20 సిరీస్:**

1వ టీ20: డిసెంబర్ 26, బెనోని (సాయంత్రం 6 గంటలకు)

2వ టీ20: డిసెంబర్ 29, పోచెఫ్‌స్ట్రూమ్ (సాయంత్రం 6 గంటలకు)

3వ టీ20: డిసెంబర్ 30, పోచెఫ్‌స్ట్రూమ్ (సాయంత్రం 6 గంటలకు)



# చమురు ధరల ఊరట.. స్టాక్ మార్కెట్‌లో కొనుగోళ్ల సందడి

**-లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు**

**-374 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్**

**-24,636 వద్ద ముగిసిన నిఫ్టీ**

**-చమురు ధరల తగ్గుదలతో ఊతం**

**-పీఎస్‌యూ బ్యాంక్ షేర్లలో కొనుగోళ్లు**

**-రియల్టీ, ఆటో షేర్లపై అమ్మకాల ఒత్తిడి**

దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం లాభాలతో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు తగ్గడం పెట్టుబడిదారుల సెంటిమెంట్‌కు ఊతమిచ్చింది. ప్రభుత్వ రంగ బ్యాంకులు, రసాయన రంగ షేర్లలో కొనుగోళ్లు పెరగడంతో సూచీలు పైకి ఎగిశాయి. సెన్సెక్స్ 374 పాయింట్లు లాభపడి 78,954.76 వద్ద ముగిసింది. నిఫ్టీ 11.35 పాయింట్లు పెరిగి 24,636 వద్ద స్థిరపడింది. నిఫ్టీ షేర్లలో రిలయన్స్ ఇండస్ట్రీస్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, భారత్ ఎలక్ట్రానిక్స్ అత్యధిక లాభాలు నమోదు చేశాయి. మరోవైపు రియల్టీ, మీడియా, ఆటో రంగ షేర్లలో అమ్మకాల ఒత్తిడి కనిపించింది. మిడ్‌క్యాప్ సూచీ 0.44 శాతం తగ్గగా, స్మాల్‌క్యాప్ సూచీ 0.48 శాతం లాభపడింది. ప్రభుత్వ రంగ బ్యాంకులు, రసాయన రంగ షేర్లు మాత్రం మార్కెట్ కంటే మెరుగైన ప్రదర్శన కనబర్చాయి. విశ్లేషకుల అంచనా ప్రకారం నిఫ్టీకి 24,600 పాయింట్ల స్థాయి తక్షణ మద్దతుగా ఉండనుంది. ఆ తర్వాత 24,500 పాయింట్ల వద్ద బలమైన మద్దతు లభించే అవకాశం ఉందని చెబుతున్నారు. అలాగే 24,700 పాయింట్ల వద్ద నిరోధం ఎదురయ్యే అవకాశముందని పేర్కొంటున్నారు. ముడి చమురు ధరలు తగ్గడం భారత్‌కు అనుకూల పరిణామమని మార్కెట్ నిపుణులు అంటున్నారు. దిగుమతి వ్యయం తగ్గడంతో పాటు ద్రవ్యోల్బణ ఒత్తిడి కూడా తగ్గే అవకాశం ఉండటంతో మార్కెట్ సెంటిమెంట్‌కు ఇది మద్దతుగా నిలిచిందని విశ్లేషిస్తున్నారు.



# బొండా ఉమా రౌడీలను పోగేసి దాడికి పాల్పడ్డారు: పేర్ని నాని

**వైసీపీ దీక్షా శిబిరంపై అధికారమదంతో బొండా ఉమా దాడి చేశారన్న పేర్ని నాని**

**ఇలాంటి దాడులు రాష్ట్ర చరిత్రలో మాయని మచ్చలా మిగిలిపోతాయని వ్యాఖ్య**

**ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయన్న పేర్ని నాని**

విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో వైసీపీ చేపట్టిన నిరాహార దీక్షా శిబిరంపై టీడీపీ శ్రేణులు దాడి చేసి టెంట్‌ను తొలగించారంటూ మాజీ మంత్రి పేర్ని నాని మండిపడ్డారు. స్థానిక ఎమ్మెల్యే బొండా ఉమా అధికారమదంతో రౌడీలను పోగేసి ఈ దాడికి పాల్పడ్డారని ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్ర రాజకీయ చరిత్రలోనే అధికార పార్టీ జరుపుతున్న ఇటువంటి దాడులు ఒక మాయని మచ్చగా మిగిలిపోతాయని విమర్శించారు. బొండా ఉమా వంటి రౌడీలను ప్రోత్సహిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ శునకానందం పొందుతున్నారని, అయితే ఈ ఆనందం ఎంతో కాలం నిలవదని పేర్ని నాని మండిపడ్డారు. శిశుపాలుడి పాపాలు పండినట్లే చంద్రబాబు ప్రభుత్వ పాపాలను కూడా ప్రజలు లెక్కిస్తున్నారని, కూటమి ప్రభుత్వానికి నూకలు చెల్లే రోజులు దగ్గరపడ్డాయని హెచ్చరించారు. "చంద్రబాబును ఏమైనా అంటే ఇళ్లకు వచ్చి కొడతామని బెదిరిస్తున్నారు. మీ చేతనైంది చేసుకోండి, ఎంతమందిని కొడతారో మేమూ చూస్తాం" అంటూ సవాల్ విసిరారు.

# సినిమా న్యూస్

## ‘గట్టా కుస్తీ 2’ (నెట్ ఫ్లిక్స్) మూవీ రివ్యూ!



విష్ణు విశాల్ - ఐశ్వర్య లక్ష్మి ప్రధానమైన పాత్రలను పోషించిన ‘గట్టా కుస్తీ’ 2022లో థియేటర్లకు వచ్చింది. తమిళంలో రూపొందిన ఈ సినిమా, 30 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టింది. చెల్లా అయ్యావు దర్శకత్వం వహించిన ఈ సినిమాకి సీక్వెల్ గా ‘గట్టా కుస్తీ 2’ నిర్మితమైంది. తమిళంలో జులై 3వ తేదీన విడుదలైన ఈ సినిమా, 50 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టింది. అలాంటి ఈ సినిమా ‘నెట్ ఫ్లిక్స్’లో జులై 31 నుంచి అందుబాటులోకి వచ్చింది. తమిళంతో పాటు వివిధ భాషల్లో స్ట్రీమింగ్ అవుతోంది.

వీర (విష్ణు విశాల్) తన భార్య కీర్తి (ఐశ్వర్య లక్ష్మీ)ని రెజ్లింగ్ ఛాంపియన్ ను చేస్తానంటూ ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటాడు. ఒక వైపున జాబ్ చేస్తూనే మరో వైపున ఆమె కుస్తీ పోటీలలో చురుకుగా పాల్గొంటూ విజయాలను అందుకుంటూ ఉంటుంది. వీర తమ కూతురు ‘మది’ (జరా)ను జాగ్రత్తగా చూసుకుంటూ, ఇంటి వ్యవహారాలను చక్కబెడుతూ ఉంటాడు. అపార్టుమెంటులోని లేడీస్ తో కలుపుగోలుగా మాట్లాడుతూ, వాళ్ల భర్తలకు మనఃశాంతి లేకుండా చేస్తుంటాడు.

‘వీర’ చేసిన గారం కారణంగా ‘మది’ చదువులో వెనకబడుతుంది. అంతే కాకుండా తన క్లాస్ పిల్లలతో గొడవపడుతూ ఉంటుంది. ఈ విషయంలో ప్రిన్సిపల్ చీవాట్లు పెడుతున్న విషయం కీర్తికి తెలియకుండా అతను జాగ్రత్తపడుతూ ఉంటాడు. ఈ నేపథ్యంలోనే ఒకానొక సందర్భంలో కీర్తి మంత్రిగారి చేతుల మీదుగా అవార్డును అందుకుంటుంది. తన ఎదుగుదలకు కారణం తన భర్త అంటూ ఆ సందర్భంలో ఆమె మాట్లాడుతుంది. కీర్తి కోచ్ (తారక్ పొన్నప్ప)కి అది ఎంతమాత్రం నచ్చదు. దాంతో కీర్తిని దెబ్బతీయాలని అతను నిర్ణయించుకుంటాడు.

‘మది’ని కూడా రెజ్లర్ ను చేయాలనే కీర్తి ఆలోచనకు ‘వీర’ అడ్డు చెబుతాడు. దాంతో వాళ్లిద్దరి మధ్య మాటామాట పెరుగుతుంది. కీర్తి కోపాన్ని నియంత్రించడం అవసరమనీ, ఆమెకి తెలియకుండా ఆమెతో వాడించమని ‘వీర’కి ఒక మెడిసిన్ ను ఇప్పిస్తాడు కోచ్. అతను చెప్పినట్టే ‘వీర’ చేయడం వలన, ఆ తరువాత జరిగిన గేమ్ లో కీర్తి ఓడిపోతుంది. అంతేకాదు ఆమె మాదక ద్రవ్యాలు వాడినట్టుగా రిపోర్టు వస్తుంది. జరిగిన దానికి తన భర్తనే కారణమని భావించిన కీర్తి ఏం చేస్తుంది? ఆమె నిర్ణయం ఎలాంటి పరిణామాలకి దారితీస్తుంది? కోచ్ కుట్ర బయటపడుతుందా? అనేది కథ.

భార్యాభర్తలకు ఒకరిపట్ల ఒకరికి ఎంతో ప్రేమ ఉంటుంది. అయితే పిల్లలు పుట్టిన తర్వాత ఇద్దరి ప్రేమ పిల్లలపైకి వెళుతుంది. వాళ్ల భవిష్యత్తును గురించే ఇద్దరూ ఆలోచన చేయడం మొదలుపెడతారు. అయితే అందుకు అవసరమైన మార్గాన్ని ఎంచుకునే విషయంలో గొడవపడితే ఎలా ఉంటుంది? ప్రేమతో చేసిన పని ద్వేషానికి కారణమైతే ఏం జరుగుతుంది? అలాంటి భార్యాభర్తల వలన పిల్లలు మానసికంగా ఎంత సంఘర్షణను అనుభవిస్తారనే అంశం చుట్టూ అల్లుకున్న కథ ఇది.

భార్యాభర్తలు తమ జీవన ప్రయాణంలో ఒకరి కోసం ఒకరు ఎన్నో త్యాగాలు చేయవలసి ఉంటుంది. అయితే ఒక్కోసారి అతి ప్రేమ కూడా మనస్పర్థలకు కారణమవుతుంది. అతి ప్రేమ అపార్థాలకు కూడా దారితీస్తుంది. ఈ పాయింట్ ను టచ్ చేస్తూనే ఈ కథ ముందుకు వెళుతుంది. నిజమైన ప్రేమ ముందు ఎలాంటి సమస్యలైనా మబ్బు తెరల మాదిరిగా తొలగిపోతాయనే విషయాన్ని నిరూపిస్తుంది. విడాకుల కోసం భార్యాభర్తల మధ్య కుస్తీపోటీని ఏర్పాటు చేయడం కొత్తగా .. వినోదభరితంగా అనిపిస్తుంది.

అనుమానాలు .. అపార్థాలు .. కీచులాటలు .. ఇరువైపులా గల కుటుంబ పెద్దల స్వభావాలను దర్శకుడు చాలా సహజంగా మలుస్తూ వెళ్లాడు. ఎవరు ఎన్ని అనుకున్నా భార్య లక్ష్యం నెరవేరడం కోసం అవమానాలు భరిస్తూ వెళ్లే భర్త పాత్ర .. ఆ పాత్రను డిజైన్ చేసిన తీరు మెప్పిస్తుంది. కుస్తీ అనేది కేవలం పేరు కోసమో .. మెడల్స్ కోసమో కాదు, ఆడపిల్లల ఆత్మరక్షణకు అవసరమనే ఒక సందేశం కూడా ఈ కథలో మనకి కనిపిస్తుంది.

విష్ణు విశాల్ నటన .. ఐశ్వర్య లక్ష్మీ అభినయం ఆకట్టుకుంటాయి. ఈ ఇద్దరి కూతురుగా నటించిన బేబీ జరా జయనా మంచి మార్కులు కొట్టేస్తుంది. విశాలమైన కళ్లతో ఆ పాప పలికించిన హావభావాలు అలా గుర్తుండిపోతాయి. ఆ పాపకి మంచి భవిష్యత్తు ఉందని చెప్పచ్చు. భాస్కరన్ ఫొటోగ్రఫీ .. సీన్ రోల్డన్ నేపథ్య సంగీతం .. భరత్ విక్రమన్ ఎడిటింగ్ కథను సపోర్టు చేస్తూ సాగుతాయి.

లవ్ .. రొమాన్స్ .. కామెడీ .. ఫ్యామిలీ ఎమోషన్స్ తో కూడిన ఈ కథ, ఫ్యామిలీ ఆడియన్స్ ను అలరిస్తుందని చెప్పచ్చు.

సినిమా వివరాలు

సినిమా పేరు: గట్ట కుస్తి 2

విడుదల తేదీ: 2026-07-31

తారాగణం: విష్ణు విశాల్, ఐశ్వర్య లక్ష్మి, జరా జ్యన్నా, మోక్ష, రమ్య కృష్ణన్, యోగి బాబు

దర్శకుడు: చెల్లా అయ్యావు

సంగీతం: సీన్ రోల్డాన్

బ్యానర్: వేల్స్ ఫిల్మ్ ఇంటర్నేషనల్

సమీక్ష: పెద్దింటి

గట్ట కుస్తీ 2 రేటింగ్: 5కి 2.50

## బాక్సాఫీస్ వద్ద భారీ క్లాష్: నవంబర్ 6న ‘రామాయణ్’ వర్సెస్ ‘గాడ్జిల్లా మైనస్ జీరో

దీపావళి కానుకగా ‘రామాయణ్’, ‘గాడ్జిల్లా’ చిత్రాల విడుదల

పండగ సెలవులు కలిసిరావడంతో ‘రామాయణ్’కు భారీ ప్రయోజనం

ఓవర్సీస్‌లో ‘రామాయణ్’కు ‘గాడ్జిల్లా’ నుంచి గట్టి పోటీ

ఐమ్యాక్స్, ప్రీమియం స్క్రీన్‌ల కోసం రెండు చిత్రాల మధ్య తీవ్ర పోటీ



ఈ ఏడాది దీపావళికి ప్రపంచ బాక్సాఫీస్ వద్ద అతిపెద్ద పోరుకు రంగం సిద్ధమైంది. నితీశ్ తివారీ దర్శకత్వంలో వస్తున్న ప్రతిష్ఠాత్మక పౌరాణిక చిత్రం ‘రామాయణ్’, జపాన్ పాపులర్ ఫ్రాంచైజీ ‘గాడ్జిల్లా మైనస్ జీరో’ ఒకే రోజున, అంటే నవంబర్ 6న విడుదల కానున్నాయి. ఒకవైపు భారతీయ ఇతిహాసం, మరోవైపు గ్లోబల్ మాన్స్టర్ ఫ్రాంచైజీ తలపడుతుండటంతో ఈ సినిమా వార్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది. తాజాగా ‘రామాయణ్’ చిత్రబృందం ఓ ఇంగ్లీష్ ట్రైలర్‌తో పాటు విడుదల తేదీని అధికారికంగా ప్రకటించింది. దీపావళి పండుగను లక్ష్యంగా చేసుకుని, ధన్‌తేరాస్ పర్వదినమైన నవంబర్ 6న సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. శుక్రవారం ప్రారంభమై, వారాంతం, ఆ తర్వాత గోవర్ధన్ పూజ, భాయ్ దూజ్ వంటి వరుస సెలవులు ఉండటంతో దేశీయ బాక్సాఫీస్ వద్ద ‘రామాయణ్’కు భారీ వసూళ్లు దక్కే అవకాశం ఉంది.

స్వదేశంలో ‘రామాయణ్’ హవా నడిచినా, విదేశీ మార్కెట్లలో మాత్రం గట్టి పోటీ తప్పేలా లేదు. జపాన్‌కు చెందిన ‘గాడ్జిల్లా మైనస్ జీరో’ చిత్రానికి ప్రపంచవ్యాప్తంగా విపరీతమైన క్రేజ్ ఉంది. దీని ముందు భాగం భారీ విజయం సాధించడమే కాకుండా ఆస్కార్ అవార్డును కూడా గెలుచుకుంది. దీంతో ఈ సీక్వెల్‌పై అంచనాలు తారాస్థాయిలో ఉన్నాయి.

ఈ రెండు సినిమాల మధ్య ప్రధాన పోటీ ఐమ్యాక్స్, ఇతర ప్రీమియం లార్జ్ ఫార్మాట్ స్క్రీన్‌ల కోసమే జరగనుంది. ఇప్పటికే ‘గాడ్జిల్లా మైనస్ జీరో’ ఐమ్యాక్స్ విడుదలను ఖరారు చేసుకున్నట్లు సమాచారం. మరోవైపు ‘రామాయణ్’ చిత్రాన్ని కూడా ఐమ్యాక్స్ ఫార్మాట్‌లోనే చిత్రీకరించారు. రణ్‌బీర్ కపూర్, సాయి పల్లవి, యశ్ వంటి భారీ తారాగణంతో వస్తున్న ‘రామాయణ్’, గ్లోబల్ మాన్స్టర్‌గా పేరున్న ‘గాడ్జిల్లా’ మధ్య పోరులో ఎవరు పైచేయి సాధిస్తారో వేచి చూడాలి.

## వెండితెరపై తండ్రీకొడుకుల సందడి: తొలిసారి తండ్రి నాగబాబుతో కలిసి నటించనున్న వరుణ్ తేజ్

**వరుణ్ తేజ్ తదుపరి చిత్రం ‘బరి’**

**ఈ చిత్రంలో స్క్రీన్ షేర్ చేసుకోనున్న నాగబాబు, వరుణ్ తేజ్**

**ఈ సినిమాకు నిర్మాతగా వ్యవహరించనున్న నిహారిక**

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ తన తదుపరి చిత్రం ‘బరి’కి సంబంధించి ఒక సరికొత్త, ఆసక్తికరమైన వార్తను అభిమానులతో పంచుకున్నారు. మెగా కుటుంబంలో దాదాపు అందరి హీరోలతోనూ స్క్రీన్ షేర్ చేసుకున్న నాగబాబు... ఇప్పటివరకు తన సొంత కుమారుడైన వరుణ్ తేజ్‌తో పూర్తిస్థాయి కాంబినేషన్ సీన్లలో కనిపించలేదు. అయితే ఆ సుదీర్ఘ నిరీక్షణకు స్వస్తి పలుకుతూ, ‘బరి’ చిత్రంలో వీరిద్దరూ కలిసి నటించబోతున్నట్లు వరుణ్ అధికారికంగా వెల్లడించారు. గతంలో ‘హ్యాండ్స్ అప్’ చిత్రంలో వరుణ్ చిన్ననాటి పాత్ర పోషించినప్పటికీ వీరిద్దరి మధ్య ఎలాంటి సన్నివేశాలూ లేవు. ఇప్పుడు రాబోయే ‘బరి’ చిత్రంలో వీరిద్దరి మధ్య అత్యంత కీలకమైన, బలమైన కాంబినేషన్ సీన్లు ఉండబోతున్నాయని వరుణ్ తెలిపారు.



విశేషమేమిటంటే, ఈ చిత్రాన్ని నాగబాబు కుమార్తె నిహారిక కొణిదెల నిర్మిస్తుండగా, ‘కమిటీ కుర్రాళ్లు’ ఫేమ్ యదు వంశీ ఈ చిత్రానికి దర్శకత్వం వహించనున్నారు. ఇటీవల కాలి గాయం నుంచి పూర్తిగా కోలుకున్న వరుణ్ తేజ్, త్వరలోనే ఈ సినిమా షూటింగ్‌లో పాల్గొననున్నారు. సొంత ఇంట్లోనే తండ్రీకూతుళ్లు, సోదరుడు కలిసి ఈ ప్రాజెక్ట్‌ను పట్టాలెక్కిస్తుండటంతో మెగా అభిమానుల్లో ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి.

## ఆనంద్ దేవరకొండ ‘ఎపిక్’ వచ్చేది అప్పుడే!

విజయ్ దేవరకొండ సోదరుడు, యువ నటుడు ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య జంటగా నటిస్తున్న రొమాంటిక్ డ్రామా ‘ఎపిక్’. ఆదిత్య హాసన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంపై ప్రేక్షకుల్లో మంచి అంచనాలు ఉన్నాయి. తాజాగా మేకర్స్ ఈ సినిమా విడుదల తేదీని అధికారికంగా ప్రకటించారు. ఈ ఏడాది సెప్టెంబర్ 11న ‘ఎపిక్’ చిత్రాన్ని థియేటర్లలోకి తీసుకురానున్నట్టు వెల్లడించారు. ఈ విషయాన్ని హీరో ఆనంద్ దేవరకొండ తన సోషల్ మీడియా ఖాతా ద్వారా పంచుకున్నారు. ఇటీవల విడుదలైన ఈ సినిమా టీజర్ ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంది. టీజర్ ప్రకారం ఈ కథ యూకే నేపథ్యంలో సాగుతుంది. షార్ట్ ఫిల్మ్ డైరెక్టర్‌గా ఆదిత్య (ఆనంద్ దేవరకొండ), కడలి (వైష్ణవి చైతన్య) అనే అమ్మాయితో ప్రేమలో పడతాడు. ఇంగ్లండ్‌లోని బోర్న్‌మత్ యూనివర్సిటీలో చదువుకోవడానికి వెళ్లిన మధ్యతరగతి కుర్రాడిగా ఆనంద్ పాత్ర కనిపిస్తుంది. టీజర్‌లోని ఓ సన్నివేశం నవ్వులు పూయించింది. తన గదిలో గర్ల్‌ఫ్రెండ్‌తో ఉన్నప్పుడు ఆదిత్యకు ఇండియా నుంచి తల్లిదండ్రులు వీడియో కాల్ చేస్తారు. షర్ట్ లేకుండా ఉన్న కొడుకును చూసి తండ్రి (శివాజీ) మందలించడం, దానికి ఆదిత్య తాను వర్కౌట్ చేస్తున్నానని అబద్ధం చెప్పడం సరదాగా అనిపించింది. ఈ టీజర్‌తో సినిమాపై ఆసక్తి మరింత పెరిగింది. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్న ఈ చిత్రానికి ప్రముఖ మలయాళ సంగీత దర్శకుడు హేషామ్ అబ్దుల్ వహాబ్ సంగీతం అందిస్తున్నారు. అజీమ్ మహమ్మద్ సినిమాటోగ్రాఫర్‌గా, నవీన్ నూలి ఎడిటర్‌గా పనిచేస్తున్నారు.




Printed by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Published by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Owned by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Printed at:SINDHURA DARSINI PUBLICATION, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Editor: KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Email:SINDHURADARSINI.2023@Gmail.com, Cell:7569677170,RNI/APTEL/2023/87662